# సుమతీశతకము

(టీకా తాత్పర్య సహితము)

పబ్లిషరు:

కొండపల్లి వీరవెంకయ్య,

శ్రీసత్యనారాయణ బుక్కుడిపో,

రాజమండ్రి.

రాజమహేంద్రవరము:

శ్రీ సత్యానందప్రెస్‌నందు

ముద్రింపబడినది.

1930

[వెల రు 0—3—0

శ్రీరస్తు.

# సుమతీశతకము.

శ్రీరాముని దయచేతను
నారూఢిగ సకలజనులు నౌరా యనగా
ధారాళమైన నీతుల
నోరూరఁగఁ జవులుపుట్ట నుడివెద సుమతీ.

టీ. సుమతీ=మంచిబుద్ధిగలవాఁడా! శ్రీరామునిదయచేతను=శ్రీరామునియనుగ్రహమువలన, ఆరూఢిగన్=నిశ్చయముగా, సకలజనులు=జనులందఱును, ఔరా=సెబాసని, అనగాన్=పల్కునట్లుగా, ధారాళమైననీతులన్=అందరకుయిష్టమగునీతులను, నోరూరగన్=నోటియందూటలూరునట్లుగా, చవులు=రుచులు, పుట్ట=కలుగునట్లు, నుడివెదన్=చెప్పెదను.

తా. ఓయోగ్యమయినమనస్సుగలవాఁడా! శ్రీరామునియనుగ్రహము వలన జనులందరును మెచ్చునట్లుగా జనులందరియాదరణమును పొందు నీతివాక్యములను, నోటియందూటలూరు నట్లుగాఁ జెప్పెదను.

క. అక్కఱకురాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమునఁ దా
నెక్కినఁ బాఱని గుఱ్ఱముఁ
గ్రక్కున విడువంగవలయుఁ గదరా సుమతీ. 2

టీ. సుమతీ! అక్కఱకున్=తగినసమయమునకు, రానిచుట్టము=రానట్టిబంధువును, మ్రొక్కినన్=నమస్కారములు చేసినను, వరము=కోరిక,

ఈని=ఇయ్యనట్టి, వేల్పున్=దేవుని, మోహరమునన్=యుద్ధమునందు, తాన్=తాను, ఎక్కినన్=ఎక్కఁగా, పాఱని=(శత్రువులవైపునకు) పరుగెత్తని, గుఱ్ఱమున్=గుఱ్ఱమును, గ్రక్కునన్=తక్షణమే, విడువంగవలయుఁగదరా=తప్పకవిడువ వలయునుగదా ?

తా. సమయమువచ్చినప్పు డుపకారమును జేయుటకురాని బంధువును, నమస్కరించినను కోరికలనియ్యని దేవుని, యుద్ధభూమియందు శత్రువుల మీదికి బరుగెత్తని గుఱ్ఱమును తప్పక విడువవలయును.

క. అడిగిన జీతం బియ్యని
మిడిమేలపుదొరనుగొల్చి ♦ మిడుకుటకంటెన్
వడిగలయెద్దులఁగట్టుక
మడిదున్నుక బ్రతుకవచ్చు ♦ మహిలోసుమతీ. 3

టీ. అడిగినన్=అడిగినను, జీతంబు=నెలబత్తెమును, ఇయ్యని=ఇయ్యనటువంటి, మిడిమేలుపు దొరను=కోపముపడు నధికారిని, కొల్చి=సేవించి, మిడుకుటకంటెన్=కష్టముల పొందుటకంటె, మహిలోన్=భూమిమీఁద, వడి=వేగము, గలయెద్దులన్= కలిగినయెద్దులను, కట్టుక=కట్టుకొని, మడిన్=పొలమును, దున్నుక=దున్నుకొని, బ్రదుకవచ్చున్=జీవనము సేయవచ్చును.

తా. అడిగినప్పటికిని జీతమునియ్యక నౌకరుమీద కోపపడుయజమానుని సేవించుటకంటె, వ్యవసాయమును జేసికొని జీవనముసేయుట మిగులమంచిపని.

క. అడియాసకొలువు గొలువకు
గుడిమణియము సేయఁబోకు ♦ కుజనులతోడన్
విడువక కూరిమిసేయకు
మడవిని దోడరయకొంటి ♦ నరుగకుసుమతీ. 4

టీ. సుమతీ, అడియాస=లాభములేని, కొలువున్=సేవను, కొలువకు=చేయకుము, గుడిమణయము=దేవాలయమందలియధికారమును, చేయన్=

చేయుటకొరకు, పోకు=వెళ్ళకుము. కుజనులతోడన్=దుర్మార్గులతోడ, కూరిమిన్=స్నేహమును, విడుపక=ఎల్లప్పుడును, చేయకు=చేయకుము. అడవిని=అరణ్యమందు, తోడు=సహాయమును, అరయక=చూచుకొనక, ఒంటిన్=ఒంటరిగా, అరుగకు=వెళ్ళకుము.

తా. లాభములేనిదే యితరులను సేవించకుము. దేవాలయములందు నధికారమునుజేయు ఉద్యోగమును చేయకుము. చెడ్డవారితో నెల్లప్పుడును స్నేహముచేయకుము. అరణ్యమున సహాయములేకుండ పోవుటయును మానుము.

క. అధరము కదలియుఁ గదలక
మధురములగు భాషలుడిగి ♦ మౌనవ్రతుఁడౌ
నధికారరోగపూరిత
బధిరాంధకశవముఁ జూడఁ ♦ బాపముసుమతీ. 5

టీ. సుమతీ! అధరము=పెదవి, కదలియున్=ఆడియు, కదలక=ఆడకను, మధురములగు=మనోహరములైన, (చెవులకు నింపైన) భాషలు=మాటలు, ఉడిగి=మాని, మౌనవ్రతుఁడౌ, మౌన=మాట్లాడకుండుటయొ, వ్రతుఁడు=నియమము గాఁగలవాఁడు, ఔ=అగునట్టి, అధికార=అధికారమనెడు, రోగ=వ్యాధిచేత, పూరిత=నిండింపబడిన, [కనుకనే] బధిర=చెవిటివాఁడును, అంధక=గ్రుడ్డివాఁడును, శవమున్=అయిన శవమును చూడన్=చూచుట, పాపము=దోషము.

తా. అధికారముచేత మత్తుడైనవాడు ఇతరులతో మాట్లాడడు. ఇతరులు తనతో చెప్పుకొనునది వినడు. వారిని కళ్ళతో చూడనైనను జూడడు. కనుక అట్టివాఁడు బ్రతికియున్నను చచ్చినవానితో సమానుడు. కాన యట్టివానిని జూచుట దోషము.

క. అప్పుగొని చేయువిభవము
ముప్పునఁ బ్రాయంపుటాలు ♦ మూర్ఖునితపముం

దప్పరయనినృపురాజ్యము
దెప్పరమై మీఁదఁగీడు ♦ దెచ్చురసుమతీ. 6

టీ. సుమతీ ! అప్పుగొని=ఋణమునుజేసి, చేయు=చేయునట్టి, విభవమును=వేడుకయును ముప్పునన్=ముసలితనమునందు ; ప్రాయంపు=యౌవనవంతురాలైన, ఆలు=భార్యయును, మూర్ఖునితపమున్=బుద్ధిహీనునియొక్క తపస్సును, తప్పు=నేరమును, అరయని=విచారింపని, నృపు=రాజుయొక్క, రాజ్యము=పరిపాలనయును, దెప్పరమై=సహింపశక్యముకానిదై, మీఁదన్=పిమ్మట, కీడున్=ఉపద్రవమును, తెచ్చుర=కలిగించును సుమీ.

తా. ఋణమును దెచ్చి చేయునుత్సవమును, ముసలితనమునందు పడుచు పెండ్లామును, బుద్ధిహీనుండు సేయు తపస్సును, తప్పొప్పుల విచారింపని రాజుయొక్క పాలనము సహింపశక్యముకానిదై చివరకు నుపద్రవమును దెచ్చును.

క. అప్పిచ్చువాఁడు వైద్యుఁడు
నెప్పుడు నెడతెగకపాఱు ♦ నేఱును ద్విజుఁడుం
జొప్పడినయూరనుండుము
జొప్పడకున్నట్టియూర ♦ సొరకుముసుమతీ. 7

టీ. సుమతీ ! అప్పు=(తగినంతయవసరము వచ్చినప్పుడు) ఋణమును, ఇచ్చువాఁడు=ఇచ్చునట్టి మనుష్యుఁడు, వైద్యుండు=మంచి వైద్యుండును, ఎల్లప్పుడున్=ఎల్లకాలములయందును, ఎడతెగక=ఎండిపోక, పాఱు=ప్రవహించు, ఏఱును=నదియును, ద్విజుఁడున్=బ్రాహ్మణుండును, చొప్పడిన=ఉన్నట్టి, ఊరన్=గ్రామమునందు, ఉండుము=నివసించుము. చొప్పడక=[పైనజెప్పిననాల్గును] లేక, ఉన్నట్టియూరన్=ఉండెడిగ్రామములో, చొరకుము=ప్రవేశింపకుము.

తా. తగినంతయవసరముగలిగిన నప్పిచ్చువాఁడును, మంచివైద్యుండును, ఏకాలమునందును, ఎండిపోక మంచినీరునిచ్చునదియును, మంచి

బ్రాహ్మణుండును, లేనియూరునందు కాపురము సేయుట మిక్కిలి కష్టము.

క. అల్లునిమంచితనంబును
గొల్లనిసాహిత్యవిద్య ♦ కోమలినిజమున్
బొల్లునదంచినబియ్యము
దెల్లనికాకులును లేవు ♦ తెలియుముసుమతీ. 8

టీ. సుమతీ ! అల్లునిమంచితనంబును=అల్లుఁడు మంచివాఁ డగుటయు, గొల్లని=గొల్లవాని (శూద్రులనుట) సాహిత్యవిద్య=పాండిత్యమును, కోమలినిజమున్ ; కోమలి=ఆఁడుదానియొక్క, నిజమున్=సత్యముపలుకుటయు, పొల్లునన్=పొల్లును, దంచినబియ్యము=దంచినచో వచ్చిన బియ్యమును, తెల్లనికాకులును=తెలుపువర్ణముగలిగిన కాకులును, లేవు=కనబడవు, తెలియుము=తెలిసికొనుమా.

తా. మంచితనముగానుండు నల్లుఁడును పాండిత్యముగలిగిన శూద్రుడును, సత్యమును జెప్పునాఁడుదియు, పొల్లును దంచితీసినబియ్యమును, దెల్లఁగానుండు కాకులును ప్రపంచమందు లేవు.

క. ఆఁకొన్న కూడెయమృతము
తాఁకొందకనిచ్చువాఁడె ♦ దాతధరిత్రిన్
సోఁకోర్చువాఁడె మనుజుఁడు
తేఁకువగలవాఁడెవంశ ♦ తిలకుఁడుసుమతీ. 9

టీ. సుమతీ ! ఆకొన్నకూడె=ఆఁకలియైనప్పుడు తిన్నయన్నమే, అమృతము=అమృతమునంటిది, తాఁకు=అడ్డును, ఒందక=చెందక, ఇచ్చువాఁడె=ఇచ్చునట్టివాడే, దాత=ధర్మాత్ముండు, ధరిత్రిన్=భూమిమీద, సోఁకు=ఆపదను, ఓర్చువాఁడె=సహించువాఁడె, మనుజుడు=నరుడు, తేఁకువగల వాడె=ధైర్యము కలవాఁడె, వంశతిలకుడు=కులమునకు భూషణమైన వాఁడు.

తా. ఆఁకలియైనప్పుడు తిన్నయన్నమే మిక్కిలి బాగుగానుండును. తగుచోటు నెఱింగియడ్డుచెప్పక ధర్మమును జేయువాఁడెదాత. ఆపదలు వచ్చినప్పు డధైర్యపడక యోర్చువాఁడె మనుష్యుఁడు. ధైర్యముగలవాఁడెవంశమంతకును గీర్తి దెచ్చును.

క. ఆఁకలి యుడుగని కుడుపును
వేఁకటియగులంజపడుపు • విడువని బ్రతుకుం
బ్రాఁకొన్న నూతియుదకము
మేఁకలపాడియును రోఁత • మేదినిసుమతీ. 10

టీ. సుమతీ ! ఆఁకలిన్=ఆకలిని, ఉడుగని=ఆపోవని, కుడుపును=తిండియును, వేఁకటియగు=గర్భముగల దగు, లంజ=ఉంపుడుఁగత్తెయొక్క, పడుపు=జారత్వమును, విడువని=విడువనట్టి, బ్రతుకున్=జీవనమును, ప్రాఁకొన్న=మురికిగలిగిన, నూతియుదకము=నూతిలోనినీరును, మేఁకలపాడియును=మేకలపాడియు, మేదినీ=భూమిపై, రోఁత=అసహ్యమైనది.

తా. ఆఁకలి తీరనట్టియన్నమును, గర్భముగల లంజయొక్కజారత్వమును, పాడుపడియున్న నూతినీళ్లును, మేఁకపాడియును, అసహ్యము కలిగించును.

క. ఇచ్చునదేవిద్య రణమునఁ
జొచ్చునదే మగతనంబు • సుకవీశ్వరులున్
మెచ్చునదే నేర్పు వాదుకు
వచ్చునదే కీడుసుమ్ము • వసుధనుసుమతీ. 11

టీ. సుమతీ ! వసుధను=భూమిలో, ఇచ్చునదే=ధనమును ధారపోయునదియే, విద్య=చదువు, రణమునన్=యుద్ధమునందు, చొచ్చునదే=ప్రవేశించు నట్టిదే, మగతనంబు=మగతనము, సుకవీశ్వరులున్=మంచికవులు, మెచ్చునదే=సంతోషించునదే, నేర్పు=సామర్థ్యము, వాదుకు=తగవు

నకు, వచ్చునదే=వచ్చునట్టిదే, కీడునుమ్ము=అపకారమును దెచ్చునది నుమీ.

తా. ధనమును ఆర్జనచేయించునదియే చదువు. పిఱికితనములేక యుద్ధ భూమియందు ప్రవేశించునదే మగతనము. గొప్పకవీశ్వరులు మెచ్చునదే నేర్పు. తగవునకు వచ్చునట్టిదేకీడు.

క. ఇమ్ముగఁజదువనినోరును
నమ్మాయని పిలిచి యన్న • మడుగనినోరున్
దమ్ములఁ బిలువని నోరును
గుమ్మరి మన్ద్రవ్వినట్టి • గుంటరసుమతీ. 12

టీ. సుమతీ ! ఇమ్ముగన్=చక్కఁగా, చదువనినోరును=చదువనినో రును, అమ్మాయని పిలచి, అన్నము=అన్నమును, అడుగనినోరున్= అడుగలేనినోరును, తమ్ములన్=తమ్ములను, పిలువని=పిలువనట్టినోరును, కుమ్మరి=కుమ్మరివాఁడు, మను=మన్నును త్రవ్వినట్టి, గుంటర=త్రవ్విన ట్టిగుంటర=త్రవ్వినగుంటనుమీ.

తా. బాగుఁగాచదువలేని నోరును, అమ్మాయనిపిలిచి యన్నమడుగని నోరును, తమ్ములతో మాట్లాడని నోరును, కుమ్మరవాఁడు మన్నును త్రవ్వి నట్టి గుంటతో సమానము.

క. ఉడుముండదె నూఱేండ్లును
బడియుండదె పేర్మిఁబాము • పదినూఱేండ్లున్
మడువునఁ గొక్కెర యుండదె
కడు నిలఁబురుషార్థపరుఁడు • గావలెనుమతీ. 13

టీ. సుమతీ ! ఉడుము=ఉడుమనుజంతువు, నూఱేండ్లును=నూరుసం వత్సరములును, ఉండదె=బ్రతుకదా, పాము=సర్పము, పేర్మిన్=అతిశ యముతో, పదినూఱేండ్లున్=వేయేండ్లును, పడియుండదె=బ్రతికియుం డదా, మడువునన్=చెఱువునందు, కొక్కెర=కొంగ, ఉండదే=ఎన్నోయేం

డ్లుఉండదా, కడున్=మిక్కిలి, పురుషార్థపరుండు=ధర్మార్థకామమోక్షములనియెడి పురుషార్థములయందాసక్తికలవాఁడు, కావలెన్=కావలయు.

తా. ఉడుము, పాము, కొంగ, మొదలగునవి చిరకాలము బ్రతికియుండును. వానివలెనే మనుష్యుండు ధర్మార్థకామమోక్షములను పురుషార్థములయొక్క చింతలేక యెంతకాలము బ్రతికియుండినను బ్రయోజనములేదు. అందుచే పురుషార్థములయం దాసక్తిగలవారై ప్రతివారును యుండవలయు.

క. ఉత్తమగుణములునీచున
కెత్తెఱఁగునఁగలుగనేర్చు ♦ నెయ్యెడలందా
నెత్తిచ్చికఱఁగిఁబోసిన
నిత్తడిబంగారమగునె ♦ యిలలోసుమతీ. 14

టీ. సుమతీ ! నీచునకున్=నీచునకు, ఉత్తమగుణములు=మంచిగుణములు, ఎత్తెఱఁగునన్=ఏరీతిని, కలుగనేర్చున్=వచ్చును, ఎయ్యెడలన్=ఏస్థలమందైనను, తాన్=తాను, ఎత్తిచ్చి=సరియైనతూనికనిచ్చి, కరగి=కరఁగించి, పోసినన్=పోసినప్పటికి, ఇత్తడి=ఇత్తడి, బంగారము=బంగారముగా, అగునే=మాఱునా.

తా. యిత్తడిని బంగారముతో సరియైన యెత్తుగల గరఁగించినను బంగారమువలె నెప్పుడును కాంతిగానుండునా ? ఆరీతిగా నేనీచున కెంత కష్టపడినను మంచిగుణములుకలుగవు.

క. ఉదకము ద్రావెడుహయమును
మదముననుప్పొంగుచుండు ♦ మత్తేభంబునన్
మొదవుకడనున్న వృషభముఁ
జదువని యానీచుకడకుఁ ♦ జనకుర సుమతీ. 15

టీ. ఉదకము=నీరును, త్రావెడు=త్రాగునట్టి, హయమును=గుఱ్ఱమున్నచోటునకు, మదమునన్=మత్తుచేత, ఉప్పొంగుచుండుమత్తేభంబునన్=

ఉద్రేకించియున్న మదపుటేనుగున్న చోటునకును, మొదవుకడన్=ఆవు దగ్గఱను, ఉన్న వృషభమున్=ఉన్నట్టియెద్దుజోలికి, చదువనియానీచుకడకున్=చదువుకొనని అల్పునిదగ్గరకును, చనకుర=వెళ్ళకుము.

తా. నీరుత్రావుగుఱ్ఱమున్నచోటకును, మత్తెక్కియున్న ఏనుఁగుస్థలమునకును, ఆవుతోనున్న యెద్దుదగ్గఱకును, చదువుకొనని నీచునిదగ్గఱకును వెళ్ళఁగూడదు.

క. ఉపకారికినుపకారము
విపరీతముగాదు సేయ ♦ వివరింపంగా
నపకారికినుపకారము
నెపమెన్నక సేయువాఁడు ♦ నేర్పరిసుమతీ. 16

టీ. సుమతీ ! ఉపకారికిన్=తనకు మేలుచేయువానికి, ఉపకారము=తిరిగి మేలును, చేయన్=చేయుట, విపరీతము=విరుద్ధము, కాదు=కాఁజాలదు ; వివరింపంగాన్=బాగుగా ఆలోచింపఁగా, అపకారికిన్=తనకు కీడు చేసినవానికి, నెపము=మిషను, ఎన్నక=తలపక, ఉపకారము=మేలును, చేయువాఁడు=చేయు స్వభావముగలవాఁడు, నేర్పరి=తెలివికలవాఁడు.

తా. తనకుపకారము చేసినవానికిఁ బ్రత్యుపకారము చేయు టొకవింత గాదు, కాని తనకుఁ అపకారము చేసినవానికైనను దిరిగి కీడుతలంపక మేలొనరించువాడే జ్ఞానముకలవాడు.

క. ఉపమింప మొదలుతియ్యన
కపటం బెడనెడను జెఱకుఁ ♦ కైవడినేపో
నెపములు వెదకును గడపటఁ
గపటపు దుర్జాతిపొందు ♦ గదరా సుమతీ. 17

టీ. సుమతీ ! కపటపుదుర్జాతిపొందు=లోపల కృత్రిమముగల దుర్మార్గునితో, సహవాసము=స్నేహము, ఉపమింపన్=పోల్చి చూడఁగా, చెఱకుకైనేపో=చెఱకుగడవలెనే సుమీ, (ఏలయనఁగా) మొదలు=

మొదటిభాగము, తియ్యన=మధురము, ఎడనెడను=మధ్య మధ్యను, కపటంబు=వంకరయైనది, (కృత్రిమముగలది) కడపటన్=చివరను, నెపములు=నేరములు, (చెఱకుపక్షమున చప్పఁదనము) వెదకునుగదరా=ఎంచునుగద.

తా. చెఱకుగడ మొదటిభాగమునందుఁ దియ్యగానుండి, నడుమ నడుమను దీపి తక్కువగానుండి, చివరకుఁ జప్పబడును. ఆలాగుననే నీచుని స్నేహము మొదట మిక్కిలి యిష్టముగానుండి, హానితెచ్చును. పోనుపోను కపటముగలదై చివరకు రసహీనమై బయలుపడిపోవును.

క. ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి ♦ యన్యులమనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుగువాఁడు ♦ ధన్యుఁడుసుమతీ. 18

టీ. సుమతీ ! ఎప్పటికిన్=ఏసమయమునకు, ఎయ్యది=ఏది, ప్రస్తుతము=రావలయునో, అప్పటికిన్=ఆవేళకు, ఆమాటలు=తగినమాటలను, ఆడి=పలికి, అన్యులమనముల్=ఇతరుల మనసులును, నొప్పింపక=బాధింపక, తాన్=తాను, నొవ్వక=బాధపడక, తప్పించుక=తప్పించుకొని, తిరుగువాఁడు=నడచుకొనువాఁడు, ధన్యుఁడు=పుణ్యాత్ముఁడు.

తా. ఏసమయమున ఎక్కడ నెట్లు మాట్లాడవలయునో, ఆసమయమునకుఁ దగినట్లు అక్కడ మాటలాడి, యొకరికి బాధగలిగింపక తాను పడకుండ తిరుగువాఁడే ధన్యుఁడు.

క. ఎప్పుడు దప్పులు వెదకెడు
నప్పురుషుని గొల్వఁగూడ ♦ దది యెట్లన్నన్
సప్పంబుపడగనీడను
గప్పవసించినవిధంబు ♦ గదరాసుమతీ. 19

టీ. సుమతీ ! ఎప్పుడున్=ఎల్లప్పుడును, తప్పులు=తప్పులను, వెదకెడున్=వెదకునట్టి, అప్పురుషుని=యామనుష్యుని, కొల్వన్=సేవించుట,

కూడదు=చేయరాదు, అది=అట్లు సేవించుట, ఎట్లు=ఏవిధము, అన్నన్= అనఁగా, సప్పంబు=పాముయొక్క, పడగ=పడగయొక్క, నీడను=నీడ యందు, కప్ప, వసించినవిధంబు=నివసించినరీతి, కదరా=సుమా.

తా. ఎండ తగులకుండ నుండుటకు సర్పముయొక్క పడగక్రిందకుఁ బోవు కప్పకువలెనే యెప్పుడును తప్పులనే వెదకు పురుషుని కొల్చినచో దప్పకుండ కీడుగలుగును.

క. ఎప్పుడు సంపదకలిగిన
సప్పుడు బంధువులువత్తు • రదియెట్లన్నన్
దెప్పలుగఁ జెరువునిండినఁ
గప్పలుపదివేలుచేరుఁ • గదరా సుమతీ. 20

టీ. సుమతీ ! ఎప్పుడు=సమయమందు, సంపద=భాగ్యము, కలుగును= ఉండునో, అప్పుడు=సమయమునందే, బంధువులు=చుట్టాలు, వత్తురు= వచ్చెదరు ; అది=అట్లువచ్చుట, ఎట్లు=ఏవిధము, అనన్=అనఁగా, చెఱువు=తటాకము, తెప్పలుగన్=పూర్తిగా, నిండినన్=నిండినయెడల, కప్పలు, పదివేలు=అనేకవేలు, చేరున్=ఆచెఱువునకు వచ్చిచేరును, కదరా=సుమా,

తా. చెఱువులోని నీరు పూర్తిగానున్నప్పుడు అనేకవేలకప్పలువచ్చును. ఆరీతిగనే భాగ్యమున్నప్పుడు అనేకబంధువులు వచ్చుచుందురు. చెఱువు లో నీరులేనప్పుడు కప్పలు ఎట్లురావో, అట్లే సంపత్తులేనివారియింటికి బంధువులు తఱుచుగారారు.

క. ఏఱకుమీ కసుగాయల
దూఱకుమీ బంధుజనుల • దోషముసుమ్మీ
పాఱకుమీ రణమందున
మీఱకుమీ గురువులాజ్ఞ • మేదినిసుమతీ. 21

టీ. సుమతీ! కసుగాయల=లేఁతకాయలను, ఏఱకుమీ=ముట్టకుము, బంధుజనులన్=చుట్టములను, దూఱకుమీ=తిట్టకుము, దోషముసుమ్మీ [తిట్టినచో] పాపముసుమా; రణమందున్=యుద్ధభూమినుండి, పారకుమీ= (వెనుకకు) పాఱిపోకుము, మేదిని=భూమియందు, గురువులాజ్ఞ=గురువులయొక్క యాజ్ఞను, మీఱకుమీ=అతిక్రమింపకుము.

తా. పండనిలేతకాయలను కోయరాదు. బంధువులను తిట్టకూడదు. యుద్ధమందోడియుఁ బాఱిపోవరాదు. గురువులమాటకు అడ్డుపలుకకూడదు.

క. ఒకయూరికి నొకకరణము
నొకతీర్పరియైనఁగాక ♦ నొగిఁదఱుచైనం
గకవికలుగాక యుండునె
సకలంబునుగొట్టువడక ♦ సహజముసుమతీ. 22

టీ. సుమతీ! ఒకయూరికిన్=ఒకచిన్నపల్లెకు, ఒకకరణమును=ఒక కరణమును, ఒకతీర్పరి=ఒక్క న్యాయము చెప్పువాడును, ఒగిన్=ఒప్పుగా, ఐనగాక=అయినకాని, తఱుచు=ఎక్కువగా, ఐనన్=అయినచో, సకలంబును=అంతయును, కొట్టువడక=చెడిపోక, కకవికలు=చెల్లాచెదరు, కాక=అగకుండ, ఉండునె=ఉండదు.

తా. ఒక్క గ్రామమునకు ఒక్క కరణమును ఒక్క న్యాయము చెప్పువాడును ఉండినబాగు. చాలమంది యున్నచో నొకరితో నొకరు పోట్లాడి అన్నికార్యములను బాడుచేయుదురు.

క. ఒల్లనిసతి నొల్లనిపతి
నొల్లనిచెలికాని విడువ ♦ నొల్లనివాఁడే
గొల్లండుకాక ధరలో
గొల్లండును గొల్లఁడౌనె ♦ గుణముసుమతీ. 23

టీ. సుమతీ ! ఒల్లనిసతిన్=ఇష్టములేని భార్యను, ఒల్లనిపతిన్=ఇష్టము లేని యజమానుని, ఒల్లని చెలికానిన్=ఇష్టములేని స్నేహితుని, విడువన్=విడుచుటకు, ఒల్లనివాఁడే=ఒప్పుకొననివాఁడే, గొల్లండు=గొల్లవాఁడు, (అనమూఢుడు) కాకని=అట్లుకాక, ధరలోన్=భూమిపై, గొల్లండును=గొల్లకులమునఁ బుట్టినవాఁడును, గుణమునన్=గుణముచేత, గొల్లఁడు=తెలివిలేనివాఁడు, కాడె=కాఁజాలఁడు.

తా. ప్రేమలేనిభార్యను, తన్నాదరింపనట్టి యజమానుని, అభిమానము లేని స్నేహితుని విడువనివాఁడు గొల్లవాఁడు (తెలివిలేనివాఁడు) కాని గొల్ల కులమందుఁబుట్టినను మంచిగుణములు కలవాఁడైనచో వాడుగొల్లఁడుకాడు.

క. ఓడలబండ్లునువచ్చును
ఓడలునాబండ్లమీఁద ♦ నొప్పుగవచ్చున్
ఓడలుబండ్లునువలె
వాడంబడుఁగలిమిలేమి ♦ వసుధనుసుమతీ 24

టీ. సుమతీ ! ఓడలన్=పడవలమీఁద, బండ్లును=బళ్లును, వచ్చును=వచ్చుచుండును, ఓడలును=పడవలుకూడ, ఆబండ్లమీదన్=ఆబండ్లమీదనే, ఒప్పుగన్=బాగుగా, వచ్చున్=వచ్చును, వసుధను=భూమిపై, కలిమి=భాగ్యము, లేమి=దరిద్రంబును, ఓడలుబండ్లునువలెనే=ఓడలువలెను బండ్లవలెను, వాడంబడున్=వాడఁబడును.

తా. ఓడలుమీఁద బళ్లును, బళ్లమీఁదఓడలును వచ్చును. ఆరీతిగానే ఒకదానివెనుక నొకటివచ్చుచు పోవుచుండును. భాగ్యదరిద్ర్యములు భాగ్యము కాని దరిద్రముగాని స్థిరముగానుండవు.

క. కడుబలవంతుండైనను,
పుడమినిబ్రాయంపుటాలిఁ ♦ బుట్టినయింటం
దడ వుండనిచ్చెనేనియుఁ
బడువఁగ నంగడికిఁదానె ♦ పంపుటసుమతీ. 25

టీ. సుమతీ! పుడమిని=భూమియందు, కడున్=మిక్కిలి, బలవంతుడైనను=బలముకలిగినవాడైనను, ప్రాయంపుటాలిన్=మంచి పడుచుతనమునందున్న భార్యను, పుట్టినయింటన్=తల్లిదండ్రులున్న తావునందు, తడవు=చాలకాలము, ఉండనిచ్చినేనియున్=ఉన్నచో, పడువఁగన్=పడుపువృత్తియను నీచవృత్తిచేయుకొఱకు, అంగడికిన్=బజారునకు, తానే=తనంతట తానే, పంపుట=సాగనంపుటవంటిది.

తా. చాల బలముకల పురుషుడైనను మంచి వయస్సులోనున్న తనభార్యను చాలకాలము పుట్టింటికడ నుండనిచ్చినచో తాను స్వయముగా నా పెయొక్క మంచిగుణములను పతివ్రతాధర్మములను చెడగొట్టినవాడగును.

క. కనకపుసింహాసనమున
శునకముఁ గూర్చుండఁబెట్టి ♦ శుభలగ్నమునం
దొనరఁగఁ బట్టముగట్టిన
వెనుకటిగుణ మేలమాను ♦ వినరా సుమతీ. 26

టీ. సుమతీ! కనకపుసింహాసనమునన్=బంగారముతో చేయబడిన పెద్ద సింహాసనముమీద, శునకమున్=కుక్కను, కూర్చుండఁబెట్టి=బలవంతముగా గౌరవించి కూర్చుండునట్లుచేసి, శుభలగ్నమునందున్=మంచిముహూర్తమునందు, ఒనరఁగన్=చక్కగా, పట్టమున్=రాజ్యాభిషేకమును, కట్టినన్=చేసినప్పటికిని, వెనుకటిగుణము=ఇంతకుమున్న దానికున్న బుద్ధిని, ఏల=ఎట్లు, మానున్=మానివేయును, వినరా=వినుము. (మానదు).

తా. చాల మంచిముహూర్తము చూచి కుక్క నొకబంగారుపల్లకీలో నెక్కించి పెద్దవైభవముతో పట్టాభిషేకము చేసినను మొదటినుండియు దానికున్న దుర్గుణమును [అనగా అశుద్ధమునుచూచి భక్షించుటకు సిద్ధపడుట మానదు] అట్లే నీచున కెంత గొప్పపదవివచ్చినను తన నీచపుపనిమాత్రము మానదు.

క. కప్పకు నొరగాలైనను
సర్పమునకు రోగమైన ♦ సతి తులువైనన్
ముప్పునదరిద్రుఁడైనను
తప్పదుమతిదుఃఖమగును తథ్యముసుమతీ. 27

టీ. సుమతీ ! కప్పకున్=కప్పకు, ఒరగాలైనన్=ఒకకాలుకుంటిదైనను, సర్పమునకు=పామునకు, రోగమైన=జబ్బువచ్చినను, సతి=ఆడుది, తులువైనన్=దుర్మార్గురాలైనను, ముప్పునన్=ముసలితనమందు, దరిద్రుఁడైనను=డబ్బులేకపోయినను, మతి=మిక్కిలి, దుఃఖమగుట=కష్టముకలుగుట, తప్పదు=మానదు, తథ్యము=నిజము.

తా. కప్పకొకకాలుకుంటిదైనను, పాముకుజబ్బువచ్చినను, భార్యదుర్మార్గురాలైనను, ముసలితనమందు దరిద్రమువచ్చినను, మిక్కిలివిచారముకలుగును. కప్పఎప్పుడు యెగిరి దాటుచు నడుచును. అందుచేదానికాలుకుంటిదైనచో చాలదుఖము. దేహముతో ప్రాకిపోవునదిగాన పామునకుజబ్బుచేసిన మిగుల కష్టము. ముసలితనమునందు డబ్బుసంపాదించుటకు శక్తియుండదుగాన కుటుంబమును పోషించుకొనుట మిక్కిలి కష్టమగును.

క. కమలములు నీటఁబాసినఁ
గమలాప్తునిరశ్మిసోఁకి ♦ కమలినభంగిన్
దమతమనెలవులు దప్పినఁ
దమమిత్రులు శత్రులౌట ♦ తథ్యముసుమతీ. 28

టీ. సుమతీ ! కమలములు=తామరపుష్పములు, నీటఁబాసినన్=నీటినుండి బయటకు వదలినచో, కమలాప్తుని=పద్మములకు స్నేహితుడైన సూర్యునియొక్క, రశ్మి=కిరణము, సోఁకి=తగిలి, కమలినభంగిన్=వాడిపోయిన రీతిగా, తమతమనెలవులు=తామెప్పుడును ఉండుస్థానములను, తప్పినన్=విడిచిన యెడల, తమమిత్రులు=తమస్నేహితులే, శత్రులౌట=తమకువిరోధులగుట, తథ్యము=యథార్థము.

తా. తామరపువ్వులను నీటిలోనుండి తీసి బయటపారవేసిన యెడల, తమస్నేహితుఁడగు సూర్యకిరణములుదాకి వాడిపోవును. ఆరీతిగానే యెవరుగాని తామున్న స్థానములనుదప్పినయెడల తమమిత్రులు తమకే శత్రులౌదురు.

క. కరణముఁ గరణము నమ్మిన
మరణాంతక మౌనుగాని ♦ మనలేఁడుసుమీ
కరణము తనసరికరణము
మఱి నమ్మక మర్మమీక ♦ మనవలె సుమతీ. 29

టీ. సుమతీ ! కరణమున్=గ్రామమునందలిలెక్కలను వ్రాయువానిని కరణము=మరియొకకరణము, నమ్మిన=నమ్మియున్నచో, మరణాంతక మౌనుగాని=చావునకుసిద్ధమయినంత కష్టమగునే కాని, మనలేఁడుసుమీ=స్వేచ్ఛగా బ్రతుకలేఁడు, [కావున] కరణము=ఒకకరణము తన సరికరణము=తనతోసమానమగు మఱియొకకరణమును, నమ్మక=నమ్మియుండక, మర్మము=రహస్యము, ఈక=తెలుపక, మనవలెన్=బ్రతుకవలెను.

తా. ఒకయూరికరణము వేరే మఱియొకయూరికరణమును నమ్మియుండి తనరహస్యములు మొదలగువాని నతనికిదెల్పినచో తప్పక కష్టముకలిగితీరును. దీనిని నెరిగి యొకకరణము మఱియొక కరణమునునమ్మియుండరాదు.

క. కరణముల ననుసరింపక
విరసంబునఁ దిన్నతిండి ♦ వికటించుఁజుమీ
యిరుసునఁ గందెనఁబెట్టక
పరమేశ్వరు బండియైనఁ ♦ బాఱదుసుమతీ. 30

టీ. సుమతీ ! కరణముల=గ్రామకరణములను, అనుసరింపక=వెంటనుండిఆశ్రయింపక, విరసంబునన్=అగౌరవముచే లెక్కలేనట్లుగా, తిన్న తిండి=తిన్నఅన్నము, వికటించుఁజుమీ=ఒంటియందు కుదురుగానుండక

పికటించును. ఇరుసునన్=బండిచెక్రముయొక్కయిరుసునందు, కందెనన్=మసియనుదానిని, పెట్టక=ఉంచక, పరమేశ్వరు బండియైనన్=శివునియొక్కబండియైనను, పాఱదు=నడువదు.

తా. ఈశ్వరునిబండియైన నిరుసునందు మసిని బూయకుండ కదలని రీతిని కరణమునుఆశ్రయించి వానినిసంతోషపెట్టక నిర్లక్ష్యముగా తిరిగిన వానికిఁ తిన్నఅన్నముకూడ కడుపులోనిముడదు. గ్రామకరణమును ఏవిధముగానైన సంతోషపెట్టనియెడల నతడనేకములయిన లేనిపోని కష్టములనుకల్పించి బాధించును.

క. కరణము సాదై యున్నను
కరిమదముడిగినను బాము ♦ కఱవకయున్నన్
ధరఁ దేలుమీటకున్నను
గరమరుదుగ లెక్కగొనరు ♦ గదరా సుమతీ. 31

టీ. సుమతీ ! కరణము=గ్రామకరణము, సాదై=పైకిమంచివాడుగా, ఉన్నను=ఉండినగాని, కరి=ఏనుగు, మదముడిగినను=ఏనుగుతేనబలముచే గలిగిన మదమునువిడచినను, పాముకఱవక=కాటువేయక, ఉన్నన్=ఉండినను, ధరన్=భూమియందు, తేలు=వృశ్చికము, మీటక=కుట్టక, ఉన్నన్=ఉన్నను, కరము=మిక్కిలి, అరుదుగన్=ఆశ్చర్యముగా, లెక్కగొనరుగదా=లెక్కచేయరుసుమా.

తా. కరణము మంచివాడుగాకనుపించినను, ఏనుగు మదములేనిదైనను; పాముకఱవక ఊరకేయుండినను, తేలుకుట్టకుండినను, జనులు లక్ష్యపెట్టరు.

క. కనుగాయఁ గఱచిచూచిన
మసలక దన యొగరుగాక ♦ మధురంబగునా
పసగలుగుయువతులుండఁగఁ
బసిబాలులఁబొందువాఁడు ♦ పశువురసుమతీ. 32

టీ. సుమతీ! కసుగాయన్=లేతదగు పచ్చికాయను, కఱచిచూచినన్=కొఱికిచూచినచో, మసలక=వెంటనే, తనయొగరు=తనకు పుట్టుకతోనే ఉన్న, ఒగరుగుణము, కాక=ఉండక, మధురంబగునా=తియ్యనిదెట్లగును, [కాదు] పస=సారము, గలయువతులు=గలిగినయౌవ్వనవతులైన స్త్రీలు, ఉండగన్=ఉండగా, పసిబాలలన్=ఏమియునెఱుంగని పిల్లలను, పొందువాఁడు=అనుభవించువాఁడు, పశువుర=పశువువంటివాఁడే.

తా. బాగుగా పండినపండ్లను విడిచి పచ్చికాయలను తినువానిరీతిగా యౌవ్వనవంతులగు స్త్రీలనేకులుండ వారినివిడిచి పసిబాలికలను బొందువాఁడు నాలుగుకాళ్లుగల పశువుతో సమానుడు. వానికిని పశువునకును భేదమేమియును లేదు.

క. కవిగానివాని వ్రాతయుఁ
నవరసభావములు లేని ♦ నాతుల వలపుం
దవిలి చనుపంది నేయని
వివిధాయుధకౌశలంబు ♦ వృధరా సుమతీ. ౩౩

టీ. సుమతీ! కవిగానివాని=పద్యములను గద్యములను స్వయముగా వ్రాయలేనివానియొక్క, వ్రాతయు=వాక్యరచనయు, నవరసభావములు=శృంగారరసము మొదలగు రసములును, వానియందలి భావములును, లేని=యెఱుంగని, నాతుల=స్త్రీలయొక్క, వలపున్=మోహమును, తవిలి=చిక్కినడి, చనుపందిన్=పారిపోవునట్టి యేదుపందిని, ఏయని=చంపలేనివాని, వివిధాయుధకౌశలంబు=అనేకవిధములయిన బాణములయొక్క ఎక్కుపెట్టుటందలి నేర్పును, వృధరా=వ్యర్థము సుమా.

తా. కవిత్వము చెప్పలేనివాడు చేసినగ్రంథము, శృంగారము మొదలగు రసములందలి భావములను తెలియని స్త్రీలమీఁది మోహమును, సమయము దొరకినను పందిని గొట్టజాలనివాని బాణము వేయుటయందలి నైపుణ్యమును వ్యర్థము.

క. కాదుసుమీ దుస్సంగతి
పోదుసుమీ కీర్తికాంత ♦ పొందినపిదపన్
వాదుసుమీ యప్పిచ్చుట
లేదుసుమీ సతులవలపు ♦ లేశముసుమతీ. 34

టీ. సుమతీ! దుస్సంగతి=దుర్జనసహవాసము, కాదుసుమీ=చేయఁగూడదుసుమా, కీర్తికాంత=కీర్తియనెడుస్త్రీ, పొందినపిదపన్=లభించిన తరువాత, పోదుసుమీ=విడిచిపోదుసుమా, అప్పు=ఋణమును ఇచ్చుట, వాదుసుమీ=జగడముసుమా, సతులవలపు=స్త్రీలకు ప్రేమ, లేశమున్=కొంచెమును, లేదుసుమీ=లేదుగదా.

తా. దుర్మార్గులతో స్నేహము చేయఁగూడదు, కష్టపడి తెచ్చుకొన్న కీర్తితొలగిపోదు; ఋణము ఇచ్చుట జగడములకు కారణమగును. స్త్రీలకు నిజమైన ప్రేమ కొంచెమైన నుండదు.

క. కాముకుఁడు తనిసివిడిచిన
కోమలిఁ బరవిటుఁడు గవయఁ ♦ గోరుట యెల్లం
బ్రేమమునఁ జెఱకుపిప్పికిఁ
జీమ వెసమూఁగినట్లు ♦ సిద్ధము సుమతీ. 35

టీ. సుమతీ! కాముకుఁడు=స్త్రీని ఆశించినవాఁడు, తనిసి=ఆశ తీర్చుకొని సంతోషించి, విడిచినకోమలిన్=విడిచిపెట్టిన స్త్రీని, పరవిటుఁడు=మఱియొక కాముకుడు, కవయకోరుట=సంగమించుటకు సిద్ధమగుట, ఎల్లన్=ఎంతయు, చెఱకుపిప్పికిన్=నమలి రసమునుపీల్చివేయఁగా మిగిలిన పిప్పికి, ప్రేమమునన్=మిగులయిష్టముతో, చీమలు=చీమలు, వెస=శీఘ్రముగా, మూఁగినట్లు=చుట్టుకొనినట్లె, సిద్ధము=నిజము.

తా. ఒకడొక స్త్రీని ముందుగ తన ఆశతీరునట్లు సంగమించి విడచిన పిమ్మట నా స్త్రీని వేఱొకడు సంగమింపవలెనని కోరుట, పిప్పిగా నమలి

రసమును పీల్చి చెఱకును పారవేసినదానికి చీమలు మూగునట్లే రసాభాస ముగా నుండకతప్పదు.

క. కారణము లేని నగవును
బేరణమును లేనిలేమ ♦ పృథివీస్థలిలోఁ
బూరణములేని బూరెయు
వీరణములు లేని పెండ్లి ♦ వృథరాసుమతీ. 36

టీ. సుమతీ! కారణములేని నగవును=కారణములేకుండని నవ్వును, పేరణమును లేనిలేమ=రవికతొడగకుండని యాఁడుదియు, పృథివీస్థలి లోన్=భూమియందు, పూరణము=బెల్లముతోఁగలిపినపప్పుఉండ, లేని బూరెయు=లేనట్టిబూరియున్ను, వీరణములు=వాద్యములు, లేని పెండ్లి= లేనట్టివివాహమును, వృథ రా=వ్యర్థముగదా.

తా. తగినంతకార్థణములేకుండ నవ్వుటయు, రవిక తొడగకుండనున్న ఆడుదియు, బెల్లముపూర్ణముతోఁగలిపి చెయ్యనిబూరెయు, వాద్యములు లేకుండచేసినపెండ్లియును వ్యర్థములయినవి.

క. కులకాంతతోడనెప్పుడుఁ
గలహింపకు వట్టితప్పు ♦ ఘటియింపకుమీ
కలకంఠికంఠిఁకన్నీ
రొలికిన సిరియింటనుండ ♦ నొల్లదు సుమతీ. 37

టీ. సుమతీ! కులకాంతతోడన్=మంచివంశమందు బుట్టి మంచిగుణ ములుగలభార్యతో, ఎప్పుడున్=ఏవేళను, కలహింపకు=దెబ్బలాడకు, వట్టి తప్పు=లేనిపోనినేరమును, ఘటియింపకుమీ=ఆమెపై మోపకుసుమా, కలకంఠికంఠికంటన్ (అనగా పతివ్రత) అట్టిఆఁడుదానికంటినుండి విచా రింపగాజారునీరు, ఒలికినన్=జారిపడినట్లయితే, ఇంటన్=ఆయిం టియందు, సిరి=లక్ష్మి, ఉండన్=ఉండుటకై, ఒల్లదు=యిష్టపడదు.

తా. మంచివంశమందుపుట్టి చక్కని గుణంబులుకలభార్యపై లేని పోని నేరములను పెట్టి ఆమెతో విరోధపడకూడదు ; ఏలయనఁగా అట్టిస్త్రీలు దుఃఖించినపుడా స్త్రీలకంటనుండి నీకేయింటిలోజారునో నాయింట్లో లక్ష్మియుండుట కష్టపడదు.

క. కూరిమిగల దినములలో
నేరము లెన్నఁడును గలుగ ♦ నేరవు మఱియా
కూరిమి విరసంబైనను
నేరములే తోఁచుచుండు ♦ నిక్కము సుమతీ. 38

టీ. సుమతీ ! కూరిమి=ప్రేమ, కలదినములలోన్=కలిగియున్న దినంబులందు, ఎన్నఁడును=ఎప్పటికిని, నేరములు=తప్పులు, కలుగ నేరవు=కలుగవు, మఱి=కాని, ఆకూరిమి=ఆప్రేమ, విరసంబైనన్=చెడిపోయిన దైనప్పుడు, నేరములే=తప్పులే, తోఁచుచుండున్=కనఁబడును, నిక్కము=యథార్థము.

తా. దెబ్బలాటలు స్థిరమగుస్నేహముతో నున్నంతకాలము ఒకరొకరి యెడతప్పులు చేసినను గానరావు ; స్నేహమెప్పుడు చెడిపోవునో యప్పుడు నిజముగా తప్పులులేకపోయినను, అన్నియు తప్పులుగానే కనుపించును.

క. కొంచెపునరుసంగతిచే
నంచితముగఁ గీడువచ్చు ♦ నదియెట్లన్నం
గించిత్తు నల్లి గఱచిన
మంచమునకుఁ బెట్లువచ్చు ♦ మహిలో సుమతీ. 39

టీ. సుమతీ ! మహిలోన్=భూమిపై, కొంచెపునరుసంగతిచేన్=అల్పుడగు పురుషుని స్నేహముచేత, అంచితముగన్=ఒప్పుగా, కీడు=అపకారము, వచ్చున్=వచ్చితీరును, అది=ఆహానివచ్చుట, ఎట్లు=ఏవిధముగా, అన్నన్=అనఁగా, కించిత్తునల్లి=చిన్నదగునల్లి, కఱచినన్=కుట్టినచో, మంచమునకున్=మంచమునకు, పెట్లు=దెబ్బలు, వచ్చున్=వచ్చితీరును.

తా. నల్లులున్న మంచమునకు దెబ్బలు తగిలినవిధంబుగా నీచునితోటి స్నేహమువలన గొప్పఆపదలు సంభవించును ; ఆకారణమున నీచులతో స్నేహము చేయఁగూడదు.

క. కొక్కోకమెల్లఁజదివినఁ
చక్కనివాఁడైన రాజ ♦ చంద్రుండైనన్
మిక్కిలిరొక్కములియ్యక
చిక్కదురా వారకాంత ♦ సిద్ధముసుమతీ. 40

టీ. సుమతీ ! కొక్కోకము=కామశాస్త్రము, ఎల్లన్=అంతయు, చదివినన్=చదివినను, చక్కనివాఁడు=చాలఅందమైనవాఁడు, ఐనన్=అయినను, రాజచంద్రుడైనన్=గొప్పరాజైనను, మిక్కిలిరొక్కములు=చాలాసొమ్ములు, ఇయ్యక=ఇయ్యకుండగా, వారకాంత=భోగముస్త్రీ, చిక్కదురా=వశముగాదురా, సిద్ధము=ఇది ప్రసిద్ధమైనదే.

తా. కామశాస్త్రమునందలి రహస్యములను జదివి రగడు దేరినవాడైనను చాల సౌందర్యవంతుఁడైనను, గొప్పరాజైనను చాల డబ్బియ్యకుండ వేశ్యాస్త్రీ స్వాధీనముగాదు. భోగముదానికి ధనమే ప్రధానమగుటయే దీనికి కారణము.

క. కొఱగాని కొడుకుపుట్టిన
కొఱగామియె కాదుతండ్రి ♦ గుణములచెఱచున్
జెఱకుతుద వెన్నుపుట్టినఁ
జెఱకునఁ దీఁపెల్లఁజెఱచు ♦ సిద్ధముసుమతీ. 41

టీ. సుమతీ ! కొఱగానికొడుకు=ప్రయోజకత్వమును సంపాదించని పుత్రుఁడు, పుట్టినయెడల=జనించినచో, కొఱగామియె=ఒక ప్రయోజకత్వముమాత్రమే లేకపోవుటకాదు, తండ్రిగుణములు=తనతండ్రికిదివఱకున్న మంచిగుణములనుకూడ, చెఱచున్=చెడునట్లుచేయును, చెఱకుతుదన్=చెఱకుగడకుచివరను, వెన్నుపుట్టినన్=కంకిపుట్టినచో, చెఱకునన్=చెఱకు

కత్తియుండలి, తీపెల్లన్=తియ్యఁదనమునంతను, చెఱచున్=పోఁగొట్టును, సిద్ధము=యథార్థము.

తా. చెఱకుగడకు చివర కంకివేసినట్లయితే, ఆకంకియే కాకుండ మిగిలిన గడయొక్క మాధుర్యముకూడ నుండదు. కత్తి వెన్నువేయఁగానే రుచి తగ్గిపోవును ; ఆరీతిగానే కుమారుడు మంచి గుణవంతుండు కానిచో తలిదండ్రులకుఁ గూడ యిదివరకున్న కీర్తిపోయి అపకీర్తివచ్చును.

క. కోమలివిశ్వాసంబును
పాములతోఁజెలిమి యన్య ♦ భామలవలపున్
వేముల తియ్యఁదనంబును
భూమీశుల నమ్మికలును ♦ బొంకురసుమతీ. 42

టీ. సుమతీ ! కోమలి విశ్వాసంబును=స్త్రీకి నమ్మకముండుటయు, పాములతో=సర్పములతో, చెలిమి=స్నేహంబును, అన్యభామల వలపున్=యితరస్త్రీలయొక్క మోహంబును, వేములతియ్యఁదనంబును=వేఁపచెట్లయొక్క మాధుర్యమును, భూమీశుల నమ్మికలును=రాజులయొక్క విశ్వాసంబులును, బొంకుర=అబద్ధమే.

తా. ఆఁడుదాని నమ్మికయును, పాములతోడి సహవాసంబును, వేఁపచెట్లకు తీపియుండుటయును, యితరుల ఆడవాండ్లకు యిష్టమును రాజులయొక్క విశ్వాసంబులును స్థిరమై నిజముకావు.

క. గడనగలమగనిఁ జూచిన
నడుగడుగున మడుఁగులిడుదు ♦ రతివలు దమలో
గడనుడుగుమగనిఁజూచిన
నడపీనుఁగు వచ్చెనంచు ♦ నగుదురు సుమతీ. 43

టీ. సుమతీ ! గడన=ఆర్జనము, గలమగనిన్=ఉన్నపెనిమిటిని, చూచినన్=చూచినచో, అతివలు=స్త్రీలు, అడుగడుగునన్=ప్రతిఅడుగునకును, మడుఁగులు=బట్టమడతలు, ఇడుదురు=పెట్టుచుందురు, గడన=ఆర్జనము,

ఉడుగుమగనిన్=చేయలేనిభర్తను, చూచినన్=చూచినయెడల, నడపీనుఁగు=నడవగలశవము, వచ్చెననుచున్=వచ్చెననుచు, తమలోన్=తమహృదయములందు, నగుదురు=నవ్వుదురు.

తా. స్త్రీలు యెక్కువగా ధనము సంపాదించు తమభర్తలకు రాగానే పాదమెక్కడ నఱిగిపోవునో యనునట్లుపచారము చేయుదురు. ధనమునార్జనచేయని భర్తవచ్చినచో లక్ష్యముచేయక అయిష్టమును చూపుదురు.

క. చింతింపకు కడచినపని
కింతులు వలతురని నమ్మ ♦ కెంతయుమదిలో
నంతఃపురకాంతలతో
మంతనములు మాను మిదియె ♦ మతమురసుమతీ. 44

టీ. సుమతీ ! కడచినపనికిన్=అయిపోయినకార్యమునకు, చింతింపకు=విచారము నొందకుము, ఇంతులు=ఆడవాండ్రు, వలతురని=ప్రేమింతురనుకొని, మదిలోన్=హృదయమున, ఎంతయు=లేశమైనను, నమ్మకు=నమ్మియుండవద్దు, అంతఃపురకాంతలతో=రాణివాసమునందుండు స్త్రీలతో, మంతనమును=రహస్యముగ మాడలాడుట, మానుము=మానివేయుము, ఇదియే=ఇదే, మతమురా=యిష్టమునుమా.

తా. అయిపోయినదానినిగురించి విచారింపవద్దు. స్త్రీలప్రేమ నిజమైనదని నమ్మకుము. అంతఃపురస్త్రీలతో రహస్యముగ మాటలాడకుము. ఇవేవియు మంచివికావుసుమా.

క. చీమలుపెట్టినపుట్టలు
పాములకిరవైనయట్లు ♦ పామరుఁడుదగన్
హేమంబుఁగూడఁబెట్టిన
భూమీశులపాలఁజేరు ♦ భువిలోసుమతీ. 45

టీ. సుమతీ ! భువిలోన్=భూమియందు, చీమలు, పెట్టినపుట్టలు=తమకై పెట్టుకొన్న పుట్టలు, పాములకున్=సర్పములకు, ఇరవైనయట్లు=

స్థానమయినవిధమున, పామరుఁడు=మూర్ఖుఁడు, హేమంబున్=బంగారమును, తగన్=ఒప్పునట్లుగా, కూడబెట్టినన్=నిలువచేసినచో, భూమీశుల పాలన్=రాజులయొక్క సన్నిధిని ; చేరున్=చేరితీరును.

తా. చీమలు పెట్టినపుట్టలు తుదకు పాములకు నివాసంబులగును. అట్లే నీచుడు తాననుభవింపక అధికముగా ధనము గడించి కూడఁబెట్టిన యెడల, చివరకా ధనము రాజుల వశమగును. కావున గడించిన ధనమును మంచి యుపయోగమునకుఁ దేవలయును.

క. చుట్టములు గానివారలు
చుట్టములము నీకటంచు ♦ సొంపుదలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబుగలుగఁ గదరాసుమతీ. 46

టీ. సుమతీ ! చుట్టములు కానివారలు=బంధువులుకానట్టి మనుజులు, గట్టిగన్=విస్తారముగా, ద్రవ్యంబు=డబ్బు, కలుగన్=ఉండగానే, నీకున్=నీకు, చుట్టములము=బంధువులము, అటంచున్=అని పలుకుచు, సొంపు=అందము, తలిర్పన్=ఒప్పఁగా, నెట్టుకొని=ప్రయత్నించి, ఆశ్రయింతురు=సేవింతురు, కదరా=కదా.

తా. ధనమును సంపాదింపఁగానే యదివఱలో ఎప్పుడును బంధువులుకానివారైనను మేము మీకు బంధువులమని వరుసలుచెప్పుచు ధనవంతుల నాశ్రయించెదరు.

క. చేతులకుఁ దొడవుదానము
భూతలనాథులకుఁ దొడవు ♦ బొంకమి ధరలో
నీతియె తొడ వెవ్వారికి
నాతికి మానంబుతొడవు ♦ నయముగసుమతీ. 47

టీ. సుమతీ ! చేతులకున్=చేతులకు, దానము=ఇవి, తొడవు=భూషణము, ధరలోన్=భూమిపై, భూతలనాథులకున్=ప్రభువులకు, బొంకమి=అబద్ధముపలుకకుండుటయే,తొడవు=అలంకారమువంటిది, ఎవ్వా

రికిన్=అందరికి, నీతియ=న్యాయము పలుకుటయే, తొడవు=అలంకా
రము, నాతికిన్=ఆడుదానికి, నయముగన్=చక్కగా, మానంబు=మంచి
తనము, తొడవు=అలంకారము వంటిది.

తా. చేతులకు దేనికైన యితరులకు దానము చేయుట, రాజు
లకు సత్యము పలుకుట, స్త్రీలకు మానము, సమస్తజనులకు న్యాయా
వలంబనమును ఆభరణములవలె కాంతినిచ్చును.

క. తడవోర్వక యొడలోర్వక
కడు వేగంబడిచిపడినఁ ♦ గార్యంబగునే
తడవోర్చిన నొడలోర్చినఁ
జెడిపోయిన కార్యమెల్లఁ ♦ జేకుఱు సుమతీ. 48

టీ. సుమతీ! తడవు=ఆలస్యమును, ఓర్వక=సహింపఁక, ఒడలు=శరీరమును, ఓర్వక=సహింపక, కడున్=మిక్కిలి, వేగంబు=వడితో, అడిచిపడినన్=ముండిపడినయెడల, కార్యంబు=పని, అగునే=సాఫల్యమగునా? కాదు. తడవు=ఆలస్యమును, ఓర్చినన్=ఓపికతో నాగినను, ఒడలు=దేహమును, ఓర్చినన్=సహించినను, చెడిపోయిన కార్యము=పాడయినపని, ఎల్లన్=అంతయును, చేకూరును=సిద్ధించును.

తా. తొందరపడక శరీరమును వంచిపని చేసికొనినవారికి జెడిపోయిన కార్యములు కూడ మంచివిగా నగును. తొందరపడి కష్టపడక మాకేమని గర్వపడి చేసిన కార్యము లెవరికైనను సిద్ధముకానున్న కార్యమైనను చెడిపోయితీరును.

క. తనకోపమె తనశత్రువు
తనశాంతమె తనకురక్ష ♦ దయచుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము
తనదుఃఖమె నరకమండ్రు ♦ తథ్యము సుమతీ. 49

టీ. సుమతీ ! తనకోపమె=తనయొక్క కోపమె, తనశత్రువు=తనవిరోధి, తనశాంతమె=తనయొక్క నెమ్మదియె, తనకున్=తనకు, రక్ష=రక్షించునది, దయ=దయ, చుట్టంబు=బంధువు, ఔన్=అవును, తనసంతోషమె=తనయొక్క ఆనందమే, స్వర్గము=ఇంద్రపదవి, తనదుఃఖమె=తనవిచారమే, నరకము=యమలోకము, అండ్రు=అనియందురు, తథ్యము=యదార్థము.

తా. కోపమున్నవానికిక విరోధియుండనక్కరలేదు. విరోధిబాధపెట్టునట్లు తనకోపమే తనను బాధించును; తనశాంతమే తనునురక్షించును; తనదయయే బంధువువలె నాదరించును; తనసంతోషమె తనకుస్వర్గసుఖముకంటె నెక్కువసుఖమును కలుగఁజేయును, తనదుఃఖమే తనకు నరకమువలె బాధపెట్టును.

క. తనయూరి తపసితనమును
దనపుత్రుని విద్య పెంపుఁ ♦ దనసతిరూపుం
దనపెరటి చెట్టుమందును
మనసున వర్ణింపరెట్టి ♦ మనుజులు సుమతీ. 50

టీ. సుమతీ ! తనయూరి తపసితనమును=తనగ్రామమునందు తనతపోనిష్ఠయు, తనపుత్రునివిద్య పెంపున్=తనకుమారునియొక్క విద్యావిశేషంబును, తనసతిరూపున్=తనభార్యయొక్క అందమును, తనపెరటిచెట్టుమందును=తనయింటిదొడ్డిలోఁ బెరుగుచున్న చెట్టుయొక్క యౌషధమును, మనసునన్=ఇష్టముతో, ఎట్టిమనుజులున్=ఎటువంటి మానవులును, వర్ణింపరు=మెచ్చరు.

తా. తన గ్రామమునందుఁజేయు ఎక్కువతపస్సును, కొడుకుయొక్క ఎక్కువ చదువును, భార్యయొక్క అందంబును, తనపెరటిచెట్టు మందును ఏమనుష్యులుకూడ పొగడి చెప్పకొనరు.

క. తనకలిమి యింద్రభోగము
తనదుఃఖమె సర్వలోక • దారిద్ర్యంబున్
తనచావు జలప్రళయము
తనవలచినయదియె రంభ • తథ్యముసుమతీ. 51

సుమతీ ! తనకలిమి=తనభాగ్యమె, ఇంద్రభోగము=దేవేంద్రసుఖము వంటిది, తనదుఃఖమె=తనయేడుపే, సర్వలోకదారిద్ర్యంబున్=సమస్తలోకములయందునిండియున్న దారిద్ర్యము, తనచావు=తనుచచ్చుటే, జలప్రళయము=యుగాంతమునందు వచ్చునీటికష్టము, తనవలచినదియె=తానుప్రేమించినస్త్రీయే, రంభ=రంభయనుపేరుగల దేవవేశ్య, తథ్యము=యదార్థము.

తా. తనకు భాగ్యముండుటే తనకు నింద్రభోగముగనుండును. తాను విచారించుచుండుటయే సకలలోకములకు దారిద్ర్యముపట్టినట్లు తలంచును. తనమరణమే ప్రళయకాలమందలి జలమయమైన యుపద్రవముగా నెంచును. తాను కోరిన ఆడుదియే రంభయనుకొనును. ఇట్లుతన సుఖదుఃఖములను సర్వలోకసామాన్యముగ నరుడు తలంచును.

క. తనవారు లేనిచోటను
జనవించుక లేనిచోట • జగడము చోటన్
అనుమానమైనచోటను
మనుజునకును నిలువదగదు • మహిలోసుమతీ. 52

టీ. సుమతీ! మహిలోన్=భూమియందు, తనవారు=తనచుట్టములు, లేనిచోటను=లేనిచోట, చనువు=చనుమానము, ఇంచుక=కొంచమైనను, లేనిచోటన్=లేనిప్రదేశమందును, జగడముచోటన్=కలహముగలస్థలమునందును, అనుమానమైనచోటను=సందేహముగల ప్రదేశమునందును, మనుజునకున్=మనుష్యునకు, నిలువన్=నిలుచుట, తగదు=యోగ్యముకాదు.

తా. తనకు దగ్గరబంధువులు లేనిచోటను తనకు జనువులేని ప్రదేశమందు, అనుమానము గలచోట్లను మనుజులుండరాదు.

క. తమలము సేయనినోరును
రమణుల చనుమొనలమీఁద ♦ రాయనిమేనుం
గమలములు లేనికొలఁకును
హిమధాముఁడు లేనిరాత్రి ♦ హీనము సుమతీ. 53

టీ. సుమతీ! తమలము=తాంబూలము, సేయనినోరును=వేసికొననట్టినోరును, రమణులచనుమొనలమీఁదన్=స్త్రీలచంటిచివరలందు, రాయనిమేనున్=రాయనిశరీరమును, కమలములు=పద్మములు, లేనికొలఁకును=లేనట్టిచెలువున్ను, హిమధాముఁడు=చంద్రుఁడు, లేనిరాత్రి=ఉండనిరాత్రియును, హీనము=కాంతివిహీనమైనవి.

తా. తాంబూలమును వేసికొననినోరు శుభ్రముగానుండును, పురుషునిశరీరము ఆడుదానిచంటి మొనలను పెట్టి రాచిన సుఖమునిచ్చును, సరస్సునందు పద్మములున్న శోభ తెచ్చును; రాత్రియందు చంద్రుడున్న ప్రకాశము గలుగును.

క. తలనుండు విషము ఫణికిని
వెలయంగాఁ దోఁకనుండు ♦ వృశ్చికమునకున్
దలతోఁకయనక యుండును
ఖలునకు నిలువెల్లవిషము ♦ గదరా సుమతీ. 54

టీ. సుమతీ! ఫణికిని=పామునకు, విషము=విషము, తలన్=శిరస్సున, ఉండున్=ఉండును, వెలయంగాన్=విస్తారముగా, వృశ్చికమునకున్=తేలునకు, తోఁకయందు, ఉండున్=ఉండును, ఖలునకున్=దుర్మార్గునకు, నిలువెల్లన్=దేహమంతటను, విషముగదరా=విషముండునుగదా.

తా. పామునకునోటియందును, తేలునకుదోఁకయందును మాత్రము విషముండునుకాని దుర్మార్గునకు తల తోఁకయను నిర్ణయంబులేక శరీరమంతటను విషమేయుండును. కనుక దుర్మార్గునిజోలికిఁ పోవఁగూడదు.

క. తనపొడుగుధనముఁబోసిన
వెలయాలికి నిజములేదు ♦ వివరింపంగాఁ
దలదడవి బాసఁజేసిన
వెలయాలినినమ్మఁగాదు ♦ వినురాసుమతీ. 55

టీ. సుమతీ ! తలపొడుగు=తలయంతయెత్తు, ధనమున్=ధనమును, పోసినన్=పోసినప్పటికి, వెలయాలికిన్=బోగముదానికి, నిజము=యదార్థము, లేదు=(ముఖమానుండి) రాదు; వివరింపంగాన్=విచారింపఁగా, తలన్=నెత్తిమీఁద; తడవి=చెయివేసి, బాసన్=ప్రమాణము, చేసినన్=చేసినప్పటికిని, వెలయాలిని=బోగముదానిని, నమ్మరాదు=నమ్మకూడదు; వినురా=వినుము.

తా. తానెంతయెత్తుండునో అంతయెత్తునను ధనముగుమ్మరించినను బోగముదికపటము లేకుండ మాటలాడదు. కాఁబట్టి నెత్తిమీఁదఁ జేయినెట్టుకొని ప్రమాణముచేసినను బోగముదానిని యెప్పుడును నమ్మకూడదు.

క. తలమాసిన నొలుమాసిన
వలువలుమాసినను బ్రాణ ♦ వల్లభు లైనం
గులకాంత లైనరోఁతురు
తిలకింపఁగ భూమిలోనఁ ♦ దిరముగసుమతీ. 56

టీ. సుమతీ ! భూమిలోన్=లోకమందు, తిలకింపఁగాన్=చూడఁగా, తల=శిరస్సు, మాసినన్=మాసినను, ఒడలు=శరీరము, మాసినన్=మట్టియైనను, ప్రాణవల్లభులైనన్=భర్తనయినను, కులకాంతలైన=కులస్త్రీలయినను, తిరముగన్=నిజముగా, రోఁతురు=యిష్టపడుదురు.

తా. భర్తలైనను, దలమాయకుండినను శరీరము మట్టిపట్టకుండినను కట్టుకొనుబట్టలు మాయకయుండినను, తక్కలేనిచో గులస్త్రీలకైనను గోత పుట్టకమానదు. కులస్త్రీలుకానివారి విషయము చెప్పనక్కఱయే లేదు.

క. తాననుభవింపనర్థము
మానవపతిఁ జేరుఁ గొంత ♦ మఱి భూగతమౌఁ
గానలనీఁగలుగూర్చిన
తేనియ యొరుఁజేరునట్లు ♦ తిరముగ సుమతీ. 57

టీ. సుమతీ! కానలన్=అడవులయందు, ఈఁగలు=తేనెటీఁగలు, కూర్చిన తేనియ=కూడబెట్టిన తేనె, ఒరున్=పరుని, చేరునట్లు=చేరువిధముగా, తాను,అనుభవింపని=ఉపయోగించుకొనని,అర్థము=ధనము, తిరముగన్=నిజముగా, కొంత=కొంతభాగము, మానవపతిన్=రాజును, చేరున్=చేరును, మఱి=మఱియును, కొంత=కొంతభాగము, భూగతము=నేలపాలు, ఔన్=అగును.

తా. వనమునందు తేనెటీఁగలు పుష్పములనుండి తీసినపూదేనె యీఁగలకు దొరకక పరులకు లభించునట్లు, మనుజుఁడు తానుపయోగింపక కూడఁబెట్టినధనము కొంతరాజులపాలును, కొంత నేలపాలునయి పోవును. అనఁగా ధనమునలోభించి కూడఁబెట్టక తగినరీతినివెచ్చ బెట్టవలయును.

క. దగ్గఱ గొండెము సెప్పెడు
ప్రెగ్గడపలుకులకు రాజు ♦ ప్రియుఁడై మఱి తా
నెగ్గుప్రజకాచరించుట
బొగ్గులకై కల్పతరువుఁ ♦ బొడుచుట సుమతీ. 58

టీ. సుమతీ! దగ్గఱన్=సమీపమున, కొండెము=అబద్ధము చెప్పెడు, ప్రగ్గడపలుకులకున్=చెప్పునట్టిమంత్రివాక్యములకు రాజు, ప్రియుఁడై=యిష్టముకలవాడై, మఱి=మఱియు, తాన్=తాను, ఎగ్గు=అపకారమును, ప్రజలకున్=లోకులకు, ఆచరించుట=ఒనర్చుట, బొగ్గులకై=మసికొరకు, కల్పతరువున్=కల్పవృక్షమును, పొడుచుట=పీకివేయుటవంటిది.

తా. మసిబొగ్గులు కావలసినకార్యములుచేసి కోరినఫలములనుయిచ్చు శక్తిగలకల్పవృక్షమునుగొట్టుట యెంతబాగుగానుండునో లేనిపోనిచాడీలు చెప్పునట్టి చెడ్డమంత్రి మాటలనమ్మి రాజా ప్రజలను శిక్షించుటయు అపభ్రంశముగానే ఉండును.

క. ధనపతిసఖుఁడై యుండిన
నెనయంగాశివుఁడుభిక్ష ♦ మెత్తఁగవలసెం
దనవారి కెంతగలిగినఁ
దనభాగ్యమె తనకుఁగాక ♦ తథ్యముసుమతీ. 59

టీ. సుమతీ! ధనపతి=కుబేరుఁడు, సఖుఁడై=మిత్రుడయి, ఉండినన్=ఉన్నను, ఎనయంగాన్=బాగుగా; శివుడు=ఈశ్వరుఁడు, బిచ్చమును, ఎత్తఁగవలసెన్=అడుగవలసివచ్చెను; తనవారికిన్=తనచుట్టములకు, ఎంతగలిగినన్=ఎంతభాగ్యముయున్నను, తనభాగ్యమే=తనయదృష్టమె, తనకున్=తనకు, కాక=అవును గాక; పరులభాగ్యము తనకును దనసంపదపరులకును రానేరదు; తథ్యము=నిజము.

తా. కుబేరునకెన్నిధనరాసులుకలకోట్లున్నను అతనికిస్నేహితుఁడైన ఈశ్వరుఁడుముష్టియెత్తియే జీవింపఁవలసివచ్చెను కానిశివునికి, కుబేరుని అయిశ్వర్యముబ్బలేదు. కాబట్టి యెవరి యదృష్టమువారిదేకాని ఒకరిది యితరులకురాదు.

క. ధీరులకుఁజేయుమేలది
సారంబగు నారికేళ ♦ సలిలముభంగిన్

గౌరవమున మఱిమీఁదట
భూరిసుఖావహమునగును ♦ భువిలోసుమతీ. 60

టీ. సుమతీ! ధీరులకున్=బుద్ధిమంతులకు, చేయమేలది=చేయు మంచిపని, నారికేళసలిలముభంగిన్=కొబ్బరికాయలోని నీటివలె, సాగమగున్=మంచిదగును, భువిలోన్=భూమియందు, మఱి=అంతేకాక, మీఁదటన్=తరువాత, గౌరవమునన్=గౌరవముతో, భూరిసుఖావహమున్=గొప్ప సౌఖ్యమును జేయునదియుకూడ, అగును=అవును.

తా. కొబ్బరిచెట్టును చక్కగా నీరువోసి పెంచిన నది ఫలించితిరిగి తియ్యనినీరును దియ్యనికొబ్బరియు నిచ్చును. ఆరీతిగానే మంచిగుణము కలవారికి నుపకారము చేసినయెడల తిరిగి ప్రత్యుపకారమును బొందుటయేకాక మిగుల గౌరవమును, సౌఖ్యమును, బొందగలరు.

క. నడువకుమీ తెరువొక్కట
గుడవకుమీ శత్రునింటఁ ♦ గూరిమితోడన్
ముడువకుమీ పరధనముల
నుడువకుమీ యొరులమనసు ♦ నొవ్వఁగసుమతీ. 61

టీ. సుమతీ! ఒక్కటన్=ఒంటరిగా, తెరువు=మార్గమున, నడువకుమీ=నడువవద్దు, కూరిమితోడ=ఇష్టముతో, శత్రునింటన్=విరోధియింట్లో, కుడువకుమీ=భోజనము చేయకు, పరధనములన్=ఇతరులడబ్బును, ముడువకుమీ=మూటకట్టవద్దు, ఒరులమనస్సు=ఇతరులహృదయము, నొవ్వఁగన్=నొచ్చునట్లు, నుడువకుమీ=మాట్లాడకుము.

తా. ఒంటరిగా దూరప్రయాణము చేయకుము; శత్రుగృహమున నిష్టముతో నేమియు తినకుము, పరులధనము నపహరింపఁకుము, విను వారికి కష్టముగలుగునట్లు మాటలాడకుము.

క. నమ్మకు సుంకరిజూదరి
నమ్మకు మగసాలవాని ♦ నటువెలయాలిన్

నమ్మకు మంగడివానిని
నమ్మకుమీ వామహస్తు ♦ నవనిన్ సుమతీ. 62

టీ. సుమతీ ! సుంకరిన్=పన్నులు వసూలు చేయువానిని, జూదరిన్=జూదమాడువానిని, నమ్మకు=నమ్మకుము, అగసాలవానిన్=కంసాలివానిని నమ్మకుము, అంగడివానిని=దుకాణము పెట్టి యమ్ముకొనువానిని, నమ్మకుము, అవనిని=భూమియందు, వామహస్తున్=పుల్లచేతివానిని, నమ్మకుమీ=నమ్మకుసుమా.

తా. పన్నులు వసూలు చేయువానిని, జూదమాడువానిని, కంసాలివానిని, భోగముదానిని, దుకాణమువానిని, పుల్లచేతితో పనులు చేయువానిని, వీరిని నమ్మి యెప్పుడును కార్యములు చేయకుము, అట్లు చేసిన నష్టము కలుగును.

క. నయమునఁ బాలుం ద్రావరు
భయమునను విషమ్ము నైన ♦ భక్షింతురుగా
నయమెంత దోసకారియొ
భయమే చూపంగవలయు ♦ బాగుగ సుమతీ. 63

టీ. సుమతీ ! నయమునన్=మంచితనముచేత, పాలున్=పాలైనను, త్రావరు=త్రాగరు, భయమునన్=బెదరింపుచేత, విషమ్మునైనన్=విషమునయినను, భక్షింతురుగా=తిందురుగదా, నయము=మెత్తఁదనము, ఎంత దోసకారియొ=ఎటువంటి దోసమును జేయునదో, బాగుగన్=చక్కగా, భయమే=భయమునే, చూపంగవలయున్=అగుపఱుపవలయును.

తా. మంచిమాటలు చెప్పి పాలు త్రాగుచున్నను త్రాగరు. బెదరించిన విషమునైన తాగుదురు కాన నయమున కార్యములు నెరవేరనియెడల భయపెట్టియే చేసికొనవలయును.

క. పరసతులు మేరఁ దప్పినఁ
దిర మొప్పఁగ విధవయింటఁ ♦ దీర్ఘరోగమైనం

గరణము వైదికుఁడైనను
మరణాంతకమౌనుగాని ♦ మానదుసుమతీ. 64

టీ. సుమతీ ! నరపతులు=రాజులు, మేరన్=హద్దును, తప్పినన్=తప్పినను, తిరము=స్థిరము, ఒప్పగన్=ఒప్పుగట్లు, విధవ=భర్తలేనిస్త్రీ, ఇంటన్=గృహమునందు, తీర్పరి=న్యాయము చెప్పునటి, ఐనన్=అయినను, కరణము=గ్రామకరణము, వైదికుఁడు=వేదాచారపరుఁడు, ఐనను=అయినను, మరణాంతకము=చావుపర్యంతము, ఔను=అవునుకాని, మానదు=తప్పదు.

తా. రాజులు న్యాయాన్యాయములు చూడకపోయినను, విధవకు ఇంట్లోపెత్తనమున్నను, గ్రామకరణమునకు లౌకికవ్యవహారములు తెలియకున్నను చావుసిద్ధము.

క. నవరస భావాలంకృత
కవితాగోష్ఠియును మధుర ♦ గానంబు సుదా
నవివేకికెంతఁజెప్పినఁ
జెవిటికి సంకూదినట్లు ♦ సిద్ధముసుమతీ. 65

టీ. సుమతీ ! తాన్=తాను, అవివేకికిన్=వివేకము లేనివానికి, నవరసభావాలంకృత కః తాగోష్ఠియు=తొమ్మిదియగుశృంగారరసము మొదలగు రసములతోను భావములతోను అలంకరింపబడిన కవిత్వప్రసక్తియు, మధురగానంబును=చెవికింపగుసంగీతమును, ఎంతఁజెప్పినన్=ఎంత చెప్పినను, చెవిటికిన్=చెవిటివానికి, సంకు=శంఖము, ఊదినట్లు=పూరించినట్లె, సిద్ధము=నిజము.

తా. వివేకము లేనివానికి నవరసములతోడను గూడినకవిత్వవిషయమై యెంతబోధించినను మనోహరమైన సంగీతము నేర్పబోయినను, చెవిటివానికి శంఖమూదినను, తెలియక నిరర్థకమైనట్లు లాభముండదు.

క. నవ్వకుమీ సభలోపల
నవ్వకుమీ తల్లిదండ్రి ♦ నాధులతోడన్
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల ♦ నయముగసుమతీ. 66

టీ. సుమతీ! సభలోపలన్=సభలయందు, నవ్వకుమీ=నవ్వకుము, తల్లిదండ్రినాధులతోడన్=తల్లితోడను, తండ్రితోడను, ప్రభువుతోను, నవ్వకుమీ=నవ్వకుము, పరసతితో=ఇతరులభార్యతో, నవ్వకుమీ=వేళాకోళము చేయకుము, విప్రవరులన్=బ్రాహ్మణోత్తములనుజూచి, నవ్వకుమీ=పరిహాసము చేయకు, నయము=మేలు, అగున్=అగును.

తా. సభలోనవ్వకూడదు, తల్లిదండ్రులతోను; అధికారితోను పరిహాసము చేయరాదు. పరస్త్రీలతో నవ్వుచుమాటలాడకుము, బ్రాహ్మణోత్తములను వేళాకోళము చేయరాదు.

క. నీరేప్రాణాధారము
నోరేరసభరితమైన ♦ నుడువుల కెల్లన్
నారేనరులకురత్నము
చీరేశృంగారమండ్రు ♦ సిద్ధముసుమతీ. 67

టీ. సుమతీ ! నీరే=ఉదకమే, ప్రాణాధారము=బ్రతుకుటకుసాధనము, నోరే=ముఖమే, రసభరితమైన= రసముతోనిండిన, నుడువులకెల్లన్=మాటలకన్నిటికిని, ఆధారము=సాధనము, నరులకున్=పురుషులకు, నారే=ఆఁడుదే, రత్నము=సరియైనఅలంకారమువంటిది, చీరే=చీరయే, శృంగారమండ్రు=సింగారమని చెప్పుదురు, సిద్ధము=యదార్థము.

తా. నీరుసమస్తజంతుజాతులకుగూడ నాధారము, రసవంతముగమాటాడుటకు నోరేసాధనము, మనుష్యులకందరకును స్త్రీ మంచిఅలంకారమువంటిది, శృంగారమును చీరయేదెచ్చును.

క. పగవల దెవ్వరితోడను
వగవంగావలదు లేమి ♦ వచ్చినపిదపం
దెగనాడవలదు సభలను
మగువకు మనసియ్యవలదు ♦ మహిలోసుమతీ. 68

టీ. సుమతీ! ఎవ్వరితోడను=ఏమనుష్యులతోను, పగ=విరోధము, వలదు=కూడదు, లేమి=దారిద్ర్యము, వచ్చినపిదపన్=వచ్చినతర్వాత, వగవం గాన్=విచారపడుట, వలదు=కూడదు, సభలను=సభలయందు, తెగన్=కఠినముగా, ఆడవలదు=మాట్లాడకూడదు, మహిలోన్=లోకమునందు, మగువకున్=స్త్రీకి, మనసు=తనమనస్సును, (అనగా మనసులో యభిప్రాయమును) ఇయ్యకూడదు=చెప్పకూడదు.

తా. ఎవ్వరితోను గలహింపఁగూడదు. దారిద్ర్యము వచ్చినప్పుడు ధైర్యము విడువకుము. సభలో కఠినముగా మాట్లాడకుము. ఆడుదానితో మనసులోని యభిప్రాయమును వెల్లడింపకూడదు.

క. పతికడకుఁ దన్నుఁగూర్చిన
సతికడకును వేల్పుకడకు ♦ సద్గురుకడకున్
సుతుకడకు రిత్తచేతుల
మతిమంతులు చనరు నీతి ♦ మార్గముసుమతీ. 69

టీ. సుమతీ! పతికడకున్=రాజుదగ్గఱకును, తన్నున్=తనను, కూర్చిన సతికడకున్=ప్రేమించిన పెండ్లాముదగ్గఱకును, వేల్పుకడకున్=దేవునిదగ్గఱ కును, సద్గురుకడకున్=యోగ్యుఁడైన ఉపాధ్యాయునిదగ్గఱకును, సుతుకడ కున్=కుమారునిదగ్గఱకును, రిత్తచేతులన్=వట్టిచేతులతో, మతిమంతులు= బుద్ధిమంతులు, చనరు=వెళ్లరు, నీతిమార్గము=అదియే మంచిపద్ధతిమార్గము.

తా. నీతిపద్ధతి నెఱిఁగిన బుద్ధిమంతులు, రాజును దేవుని ఉపాధ్యా యుని జూడఁదలచినపుడు వట్టిచేతులతో వెళ్లరు. పండ్లు, పువ్వులు మొద లగువానిని బట్టుకొనివెళ్లి దర్శనము చేయవలెను. భార్యవద్దకు బోవునపుడు

ఆమెకు నిష్టమగు వస్తువును పట్టుకొనివెళ్లవలెను. కుమారుని దగ్గఱకు బోవు నపుడు తినెడు వస్తువునేదేని పట్టుకొనిపోవలెను. అట్లుపట్టుకొని వెళ్లనిచో గౌరవింపరు.

క. పనిసేయు నెడల దాసియు
నను భవమున రంభ మంత్రి ♦ యాలోచనలం
దున భుక్తి యెడలఁ దల్లియు
ననఁ దనకులకాంత యుండ ♦ నగురా సుమతీ. 70

టీ. సుమతీ ! పని=పనిని, చేయు నెడలన్=చేయు సమయమున, దాసియున్=దాసియు, అనుభవమునన్=భోగకాలమున, రంభ=రంభయు, ఆలోచనలందున=ఆలోచనల చెప్పునపుడు, మంత్రి=ప్రధానియు, భుక్తి యెడలన్=భోజనము పెట్టుకాలమున, తల్లియున్=తల్లియు, అనన్=అనునట్లు, తనకులకాంత=తనభార్య, ఉండన్=ఉండుట, అగురా=తగును.

తా. పనిపాటలు చేయుకాలమున బద్ధకము లేక దాసివలెను, భోగమునందు రంభరీతిగను, ఆలోచనఁ గావలసియున్నపుడు మంత్రివిధంబుగాను, భోజనము పెట్టువేళ తల్లిపోల్కె భార్య యుండవలెను.

క. పరనారీసోదరుఁడై
పరధనముల కాసపడక ♦ పరులకు హితుఁడై
పరులు దనుఁబొగడ నెగడియుఁ
బరు లలిగిన నలుగనతఁడు ♦ పరముఁడు సుమతీ. 71

టీ. సుమతీ ! పరనారీసోదరుఁడై=యితరుల స్త్రీలకు తమ్మునివంటివాడవై, పరధనములకున్=పరుల ద్రవ్యములకు, ఆసపడక=చేసాచి యిష్టపడక, పరులకు=ఇతరులకు, హితుఁడై=ఇష్టుఁడై, పరులు=ఇతరులు, తనున్=తనను, పొగడన్=కొనియాడగా, నెగడియున్=వృద్ధినొందియు, పరులు=ఇతరులు, అలిగినన్=కోపించిన, అలుగనతఁడు=కోపించనివాఁడు, పరముఁడు=మంచివాఁడు.

తా. పరస్త్రీలయెడ సోదరునివలె నడచినవాఁడును, యితరులడబ్బును గోరనివాఁడును, లోకులకిష్టమైనవాఁడును, పరులు తనను మెచ్చునట్లు ప్రవర్తించువాఁడును, ఇతరులు కోపపడినను తాను నెమ్మదిగలవాఁడును నయినవాఁడే మంచివాఁడు.

క. పరసతి కూటమిఁ గోరకు
 పరధనముల కాసపడకు ♦ పరు నెంచకుమీ
 సరిగాని గోష్ఠి సేయకు
 సిరి చెడి చుట్టంబుకడకుఁ ♦ జేరకు సుమతీ.

టీ. సుమతీ ! పరసతికూటమిన్=యితరుల ఆడవాండ్లతో స్నేహమును, కోరకు=ఇష్టపడకుము, పరధనములకున్=ఇతరుల ద్రవ్యములకు, ఆసపడకుము=ఆశపడకుము, పరున్=ఇతరుని, ఎంచకుమీ=తప్పులెంచకుము, సరి=యుక్తము, కానిగోష్ఠి=కూడనిప్రసంగమును, చేయకు=చేయకుము, సిరి=భాగ్యము, చెడి=పోయినకాలమున, చుట్టంబుకడకున్=బంధువునొద్దకు, చేరకు=వెళ్లకు.

తా. పరస్త్రీనిబొందఁ నిష్టపడకుము. పరులడబ్బు నాశింపరాదు. పరునితప్పులు చెప్పకుము. కూడనిప్రసంగము చేయకుము, తనకు భాగ్యము లేనప్పుడు చుట్టములకడకు తఱచు పోఁగూడదు. వెళ్లిన మర్యాదపోవును.

క. పరసతులగోష్ఠినుండిన
 పురుషుఁడు గాంగేయుఁడైన ♦ భువి నిందపడుం
 బరసతి సుశీలయైనను
 బరుసంగతినున్న నింద ♦ పాలగు సుమతీ. 73

టీ. సుమతీ ! భువిన్=భూమియందు, పరసతులగోష్ఠిన్=ఇతరస్త్రీలతో ప్రసంగమున, ఉండినపురుషుఁడు=ఉన్నట్టిమగవాఁడు, గాంగేయుఁడైన=భీష్మునంతటివాఁడైనప్పటికిని, నిందపడున్=అపకీర్తిపడితీరును, పరసతి=పరస్త్రీ, సుశీలయైనన్=మంచిస్వభావముకలదైనను, పరుసంగతిన్=

ఇతర పురుషుని సాంగత్యముతో, ఉన్నన్=ఉండినయెడల, నిందపాలు=అపకీర్తి తెచ్చుకొన్నది, అగున్=అవును.

తా. పురుషుఁడు భీష్మాచార్యునివంటి బ్రహ్మచారియైనను, పరస్త్రీతో గోష్ఠిసల్పినచో లోకమునందు నిందాపాత్రుఁడగును; స్త్రీయును యితర పురుషులసంగతినున్నయెడల, నెంతమంచిగుణములు కలదైనను, నింద్యురాలగును.

క. ఒరునాత్మఁ దలఁచుసతి విడు
మఱుమాటలు పలుకుసుతుల ♦ మన్నింపకుమీ
వెఱపెఱుఁగని భటునేలకు
తఱుచుగ సతిఁగవయబోకు ♦ తగదురసుమతీ. 74

టీ. సుమతీ! ఒరున్=యితరుని, ఆత్మన్=హృదయమున, తలఁచు సతిన్=తలఁచునట్టిఆడుదానిని, విడు=విడిచిపెట్టుము, మఱుమాటలు=బదులుమాటలు, పలుకుసుతులన్=ఆడునట్టి కుమారులను, మన్నింపకుమీ=ఆదరింపకుము, వెఱపు=భయము, ఎఱుఁగనిభటున్=తెలియనిసేవకుని, ఏలకు=రక్షింపకుము, తఱుచుగన్=పలుమాఱు, సతిన్=స్త్రీని, కవయన్=భోగించుటకు, పోకు=పోవకుము, తగదుర=కూడదుగదా.

తా. యితరునియందు యిష్టముగల భార్యను విడిచిపెట్టవలయును. ఎదిరించి మాట్లాడుకొడుకులను విడిచిపెట్టవలయును. భయముగఁ బనిచేయని సేవకుని తక్షణమే మాన్పింపవలెను. తఱుచుగా ఆడవాండ్లతో పరిచయము చేసి అనేకమారులు సంగమింపకూడదు.

క. పరులకు నిష్టము సెప్పకు
పొరుగిండ్లకుఁ బనులులేక ♦ పోవకుమెపుడుం
బరుఁగదిసిన సతిఁగవయకు
మెఱుఁగియు బిరుసైనహయము ♦ నెక్కకుసుమతీ. 75

టీ. సుమతీ! పరులకున్=ఇతరులకు, ఇష్టము=మనసులోవున్న యభిప్రాయమును, చెప్పకు=చెప్పకుము, పనులు=కార్యములు, లేక=లేకుం

డగ, పొరుగిండ్లకున్=యితరులయిండ్లకు, ఎపుడున్=ఏవేళ నైనను, పోవ కుము=వెళ్ళకుము, పరున్=పరపురుషుని, కదిసినసతిన్=పొందినస్త్రీని, కవయకుము=రమింపకుము, ఎఱిఁగియున్=ఎఱిగియుండియు, బిరుసైన= మోటగు, హయమున్=గుఱ్ఱమును, ఎక్కకు.

తా. నీమనస్సులోని యభిప్రాయమునందఱితోడను చెప్పకుము. దగ్గఱ నున్న యిండ్లకైనను నవసరములేకుండఁగఁ బోకుము; పరునిఁ గూడిన స్త్రీతో రమింపకుము, మోటగుఱ్ఱముమీద స్వారిచేయకుము.

క. పర్వముల సతులఁగవయకు
ముర్వీశ్వరుకరుణనమ్మి ♦ యుబ్బకుమదిలో
గర్వింపనాలిఁ బెంపఁకు
నిర్వాహము లేనిచోట ♦ నిలువకుసుమతీ. 76

టీ. సుమతీ! పర్వములన్=అమావాస్య మొదలగు పర్వపుదినములందు, సతులన్=స్త్రీలను, కవయకుము=కూడకుము, ఉర్వీశ్వరుకరుణన్=రాజు యొక్కదయను, నమ్మి=నమ్మికొని, మదిలోన్=మనసునందు, ఉబ్బకు= పొంగకుము, గర్వింపన్=గర్వముకలుగునట్లు, ఆలిన్=భార్యను, పెంపకు=లాలనముచేయకుము, నిర్వాహము=జరుగుబాటు, లేనిచోట=లేని స్థలమందు, నిలువకు=ఉండకుము.

తా. అష్టమి, ఏకాదశి, సంక్రాంతి, సంక్రమణము, శివరాత్రి, పూర్ణిమ, అమావాస్య, చతుర్దశి, మొదలగు పర్వపుదినములందు స్త్రీలను పొందకుము. రాజులదయ శాశ్వతమని నమ్మకుము, పొగరెక్కునట్టుగ భార్యకు చనువియ్యకుము, జరుగుఁబాటులేనిచోట నిలువ కుము.

క. పలుదోమి సేయువిడియము
తలగడిగిననాఁటినిద్ర ♦ తరుణులమొదలం

బాలయలుకనాఁటికూటమి
వెలయింతని చెప్పరాదు ♦ వినురా సుమతీ. 77

టీ. సుమతీ ! పలుతోమి=పండ్లుతోముకొని, చేయువిడియము=వేసికొన్నతాంబూలమును, తలగడిగిననాఁటినిద్ర=తలయంటుకొనినదినమున బోవునిద్రయును, తరుణులయెడలన్=ఆడువారివిషయమున, పొలయలుకనాఁటికూటమి=ప్రణయకోపముఁ గలిగినరోజునఁజేయు సంగమమును, ఇంత=ఇంతటి, వెల=విలువ అని, చెప్ప రాదు=చెప్పలేము, వినురా=ఆలకింపుము.

తా. పండ్లుతోముకొని వేసికొనినతాంబూలము, తలయంటుకొనిననాఁటినిద్రయు ప్రణయకోపమువచ్చిననాఁటి సంభోగంబును చాల సుఖమును యిచ్చును.

క. పాటెఱుఁగని పతికొలువును
కూటంబున కెఱుకపడని ♦ కోమలిరతియుం
బేటెత్తజేయు చెలిమియు
నేటికినెదురీఁదినట్టు ♦ లెన్నగ సుమతీ. 78

టీ. సుమతీ ! పాటు=కష్టమును, ఎఱుగనిపతికొలువును=తెలిసికొనని రాజునుకొలుచుటయు, కూటంబునకున్=పరపురుషునితోడిసంగమమునకు, ఎఱుకపడని=తెలిసికొనని; కోమలిరతియున్=ఆడుదానిసంభోగమును, పేటెత్తచేయుచెలిమియున్=మర్యాదచెడిపోవురీతిగా చేయునట్టిస్నేహమును, ఎన్నగన్=ఊహింపగా, ఏటికిన్=నదికి, ఎదురు=ఎదురుగా, ఈదినట్లు=ఈదినవిధము.

తా. సేవకుని కష్టసుఖములను గమనించనిరాజును సేవించుటయు, పురుషునివలె సౌఖ్యము నెఱుఁగని స్త్రీతోడిసంభోగమును, గౌరవము నెఱుఁగనివానితోడి స్నేహమును, నదీప్రవాహమున కెదురుగాబడియీదునట్లు చాలాబాధలకును దుఃఖములకును హేతువగును.

క. పాలనుగలిసిన జలమును
బాలవిధంబుననెయుండుఁ ♦ బరికింపంగాఁ
బాలచవిఁ జెఱుచుఁ గావున
బాలసుఁ డగువానిపొందు ♦ వలదురసుమతీ. 79

టీ. సుమతీ! పాలను=పాలయందు, గలిసినజలమును=కలిసియున్న నీరు సైతము, పరికింపంగాన్=ఆలోచింపఁగా, పాలవిధంబుననె=పాలవలెనె తెల్లగా, ఉండున్=ఉండును, పాలచవిన్=పాలయొక్క రుచిని, చెఱుచున్=చెడగొట్టును, కావునన్=ఆకారణమున, పాలసుఁడు=దుర్జనుఁడు, అవువానిపొందు=అయినవానితోడి స్నేహము, వలదుర=కూడదు.

తా. పాలలోఁగలిసిన నీరుకూడ, పాలవలె తెల్లగానుండునుకాని యాపాలయొక్క రుచిని బోఁగొట్టును, కాబట్టి అల్పునితోడి స్నేహము నష్టమేకాని లాభముండదు.

క. పాలసునకైన యాపద
జాలింబడి తీర్ప వలదు ♦ సర్వజ్ఞునకుం
దేలగ్నిఁబడఁగఁ బట్టిన
మేలెఱుగునె మీఁటుఁగాక ♦ మేదినిసుమతీ. 80

టీ. సుమతీ! మేదిని=భూమిమీఁద, పాలసునకున్=నీచునకు, ఐన యాపదన్=వచ్చినకష్టమును, జాలిన్=దయను, పడి=పొంది, తీర్పన్=తీర్చుట, సర్వజ్ఞునకున్=సమస్తముదెలిసినవానికైన, వలదు=కూడదు, తేలు, అగ్నిన్=నిప్పులలో, పడఁగ=పడుచుండగా, పట్టినన్=పట్టుకొనినచో, మీటున్=కుట్టును, కాక=కానిచోట, మేలు=ఉపకారమును, ఎఱుగునె=ఎఱుగునా (ఎఱుగదు.)

తా. దుష్టునికి కష్టముకలిగినపుడు సహాయముచేసినచో, నిప్పులలోఁబడు తేలును పట్టుకొనఁగా మనచేతిని కుట్టినట్లు తిరిగి యుపకారమును జేయుటకు మాఱుగా అపకారమునేచేయదలఁచును ఆకారణమున దుర్మార్గునికి సహాయము చేయరాదు.

క. పిలువనిపనులకుఁబోవుట
కలయనిసతిరతియు రాజు ♦ గావని కొలువుం
బిలువని పేరఁటంబును
వలవని చెలిమియును జేయ ♦ వలదురసుమతీ. 81

టీ. సుమతీ ! పిలువనిపనులకున్=పిలువనికార్యములకు, పోవుట= వెళ్లుట, కలయనిసతిరతియున్=తననుయిష్టముగాచూడనిస్త్రీతో భోగించుటయు, రాజు=ప్రభువు, కావనికొలువున్=తిన్నగా కనిపెట్టని యుద్యోగమును, పిలువని పేరంటమును, వలవనిచెలిమియును=కూడని స్నేహమును, చేయన్=సేయుట, వలదుర=తగదు.

తా. తనను పిలువనిపనులకు వెళ్ళుటయు, హృదయముకలియని స్త్రీతోఁ భోగించుటయు రమ్మనకుండా పేరంటమునకు వెళ్లుటయు, కూడనివానితో స్నేహమును జేయకూడని పనులు.

క. పురికిని బ్రాణము కోమటి
వరికిని బ్రాణంబునీరు ♦ వసుమతిలోనం
గరికిని బ్రాణము తొండము
సిరికిని బ్రాణంబు మగువ ♦ సిద్ధముసుమతీ. 82

టీ. సుమతీ ! వసుమతిలోనన్=భూమియందు, పురికిని=పట్టణము నకు, కోమటి=వర్తకుడు, ప్రాణము=జీవమువంటివాడు, వరికిని=వరిపైరునకు, నీరు=జలము, ప్రాణంబు=ప్రాణమువంటిది, కరికిని=ఏనుఁగునకు, తొండము, ప్రాణము=జీవము, సిరికిని=సంపదకు, మగువ=స్త్రీ, ప్రాణంబు= జీవము, సిద్ధము.

తా. గొప్పపట్టణమునకు కోమటియు, వరిపైరునకునీరును, ఏనుగు నకు తొండమును, భాగ్యమునకు ఆఁడుదియును ప్రాణమువలె యాధా రములునుమా

క. పులిపాలు తెచ్చియిచ్చిన
నలవడఁగా గుండెగోసి ♦ యఱచేనిడినం
దలపొడుగు ధనముపోసిన
వెలయాలికిఁ గూర్మిలేదు ♦ వినురాసుమతీ.

టీ. సుమతీ ! పులిపాలు=పెద్దపులియొక్కపాలను, తెచ్చి=చేకొని వచ్చి, ఇచ్చినన్=ఇచ్చినను, అలవడగాన్=అలవాటుగా, గుండె=హృదయమును, కోసి=కత్తితోకోసి, అఱచేన్=చేతిమధ్యయందు, ఇడినన్=పెట్టినప్పటికిని, తలపొడుగు=తలయెత్తుధనమును, పోసినన్=గుమ్మరించినను, భోగముదానికి, కూర్మి=నిజమగుప్రేమ, లేదు, వినురా=ఆలకించుము.

తా. ధైర్యమునకష్టపడి పులిపాలను తీసుకొనివచ్చి యిచ్చినను, చావునకొప్పుకొని గుండెకోసి చేతికిచ్చినను, నిలువెత్తున ధనముపోసినను భోగముదానికి నిజమైనప్రేమయుండదు.

క. పెట్టినదినముల లోపల
నట్టడవుల కైనవచ్చు ♦ నానార్థములుం
బెట్టనిదినమునఁ గనకపు
గట్టెక్కిననేమిలేదు ♦ గదరాసుమతీ. 84

టీ. సుమతీ ! పెట్టినదినములలోపలన్=యెవరికైనను పెట్టిపుట్టినరోజులలో, నట్టడవుల కైనన్=అడవులమధ్యమమున కైనను, నానార్థములున్=అన్నిపదార్థములును, వచ్చున్=వచ్చును, పెట్టనిదినములన్=(పూర్వజన్మమున) ఒకరికిపెట్టియుండనిరోజులలో, కనకపుగట్టు=బంగారపుకొండను, ఎక్కినన్=ఎక్కినను, ఏమి=ఏమియును, లేదుగదరా=లభింపదుగదా.

తా. పూర్వపురోజులలో యెవరికైనను పెట్టిపుట్టినయెడల అడ

లలోనట్టనడుమను నివసించినను సకలార్థములు కలుగును; పూర్వ జన్మమునందు పెట్టిపుట్టనియెడల మేరుపర్వతము మీఁద కాపురమున్నను యేమియును లాభము లేదు.

క. పొరుగునఁ బగవాఁడుండిన
నిరవొందఁగ వ్రాతకాఁడె ♦ యేలికయైనం
ధరఁగాఁపుకొండెఁడైనను
గరణాలకు బ్రతుకులేదు ♦ గదరా సుమతీ. 85

టీ. సుమతీ! ధరన్=భూమిపై, పొరుగునన్=ప్రక్కను, పగవాఁడు=శత్రువు, ఉండినన్=ఉన్నను, ఇరవందగన్=బాగుగా, ఏలిక=రాజు, వ్రాతకాఁడయ్యెనన్=వ్రాయనేర్చుకొన్నవాఁడే, అయినను, కాఁపు=వ్యవసాయము చేయువాఁడు, కొండెఁడు=చాడీచెప్పువాఁడు, ఐనన్=ఐనను, కరణాలకున్=గ్రామకరణములకు, బ్రదుకు=జీవనము, లేదుగదరా=ఉండదుగదా.

తా. తనకువిరోధియైనవాఁడు తనయింటికి సమీపమున నుండినను వ్రాయను జదువను తెలిసినవాఁడు రాజైనను, వ్యవసాయము చేయువాఁడు చాడీకోరైనను, కరణమునకు డబ్బేమియును దొరకదు.

క. బంగారు కుదువఁ బెట్టకు
సంగరమునఁ బాఱిపోకు ♦ సరసుఁడవైతే
నంగడి వెచ్చములాడకు
వెంగలితోఁ జెలిమివలదు ♦ వినురా సుమతీ. 86

టీ. సుమతీ! సరసుఁడవైతే=రసము తెలిసినవాఁడవయిన, బంగారు=బంగారమును, కుదువఁబెట్టకు=తాకట్టుపెట్టకుము, సంగరమునన్=యుద్ధమందు, పాఱిపోకుము, అంగడిన్=అంగడియందు, వెచ్చములు=ఇంట్లో వాడుకొను వస్తువులకై చేసినఅప్పులనుగురించి, ఆడకుము=

చెప్పుకొనకుము, వెంగలితోడన్=మూర్ఖునితో, చెలిమి=స్నేహము, వలదు=చేయకుము, వినురా=వినుము.

తా. రసజ్ఞుఁడైనవాఁడు బంగారమును గుదువఁబెట్టఁడు, యుద్ధభూమినుండి పాఱిపోఁడు, ఇంట్లోవాడుకొనుటకయిన చిల్లరియప్పులను వెల్లడింపఁడు, మూర్ఖునితో సహవాసము చేయుఁడు.

క. బలవంతుఁడ నాకేమని
పలువురతో నిగ్రహించి ♦ పలుకుట మేలా?
బలవంతమైన సర్పము
చలిచీమల చేతఁజిక్కి ♦ చావదె సుమతీ. 87

టీ. సుమతీ! బలవంతుఁడ=బలముకలవాఁడను, నాకున్=నాకు, ఏమని=ఏమిలోటని, పలువురతోన్=చాలమందితో, నిగ్రహించి=కలహించి, పలుకుట=మాటలాడుట, మేలా=మంచిదా? కాదు! బలవంతమైన సర్పము=బలముగల పాము, చలిచీమల చేతన్=నల్లని చిన్నచీమల చేత, చిక్కి=తగులువడి, చావదె=చచ్చిపోవదా ? చచ్చిపోవును.

తా. చిన్నచీమలు బారుగాకూడి పెద్దబలమైనపామును చంపఁగలుగు నట్లు పదిమంది మనుష్యులుకూడి యెంతబలశాలి నైనను జయించగలరు. గాన అందఱితోడను దెబ్బలాడకూడదు.

క. మండలపతి సముఖంబున
మెండైన ప్రధాని లేక ♦ మెలఁగుట యెల్లం
గొండంత మదపుటేనుఁగు
తొండము లేకుండినట్లు ♦ దోఁచుసుమతీ. 88

టీ. సుమతీ! మండలపతిసముఖంబునన్=రాజుయొక్క సన్నిధానమున, మెండైన ప్రధాని=సామర్థ్యముగలమంత్రి, లేక=లేకుండగ, మెలఁగుట=ప్రవర్తించుట, ఎల్లన్=అంతయును, కొండంతమదపుటేనుఁగు=పర్వతమంత మదగజము, తొండము, లేకుండినట్లు=లేకుండినవి

ధము, తోఁచుర=తోఁచునుగదా.

తా. కొండంత పెద్దయేనుఁగుకూడ తొండములేనియెడల బలమెంతయున్నను బనికిరానియట్లు, రాజెంతగొప్పవాఁడైనను మంత్రిలేనియెడల రాజ్యముచేయుటకష్టము.

క. మంత్రిగలవానిరాజ్యము
తంత్రముసెడకుండనిలుచుఁ ♦ దఱుచుగ ధరలో
మంత్రివిహీనునిరాజ్యము
జంత్రపుఁగీ లూడినట్లు ♦ జరగదుసుమతీ. 89

టీ. సుమతీ! మంత్రిగలవానిరాజ్యము=ప్రధానినిబెట్టిన రాజుయొక్క ప్రభుత్వము, తంత్రము=యోచన, చెడకుండన్=చెడిపోనకుండగ, నిలుచున్=నిలుచును, దఱుచుగన్=విశేషముగా, ధరలో=భూమియందు, మంత్రివిహీనుని రాజ్యము=మంత్రిలేనివానిరాజ్యము, జంత్రపుకీలు=యంత్రముయొక్కమఱ, ఊడినట్లు=ఊడిపోయినరీతిగా, జరగదు=సాగదు.

తా. రాజుమంత్రిసహాయమున రాజ్యము చక్కఁగాఁజేయఁగలుగును. సలహాచెప్పుటకు మంత్రిలేనియెడల మఱలూడిపోయిన యంత్రమువలె రాజ్యము బాగుగాజరగనేరదు.

క. మాటకుఁ బ్రాణముసత్యము
కోటకుఁ బ్రాణంబు సుభట ♦ కోటిధరిత్రిన్
బోటికిఁ బ్రాణముమానము
చీటికిఁ బ్రాణంబువ్రాలు ♦ సిద్ధముసుమతీ. 90

టీ. సుమతీ! ధరిత్రిన్=భూమియందు, మాటకున్=పలుకునకు, ప్రాణము=జీవము, సత్యము=యదార్థము, కోటకున్=కోటకు, ప్రాణంబు=

జీవము, సుభటకోటి=దిట్టమైన బంటులసమూహము; బోటికిన్=ఆడదానికి, ప్రాణము=జీవము, మానము=గౌరవములోపము లేకుండసంచరించుట; చీటికిన్=ఉత్తరమునకు, వ్రాలు=చేవ్రాలు, ప్రాణంబు=ప్రాణము, సిద్ధము=నిజము.

తా. సత్యమేమాటకు ప్రాణమువంటిది. అనఁగా సత్యవాక్యమనుష్యుని ప్రాణమువలెఁగాపాడును; దిట్టమైనబంట్రోతులున్న కోటకు భంగముకలుగదు. ఒకరిచేమాటపడకుండ మెలఁకువతో నుండిన స్త్రీకి శ్రేయస్సు వచ్చును; చేవ్రాలున్న చీటి చెల్లును, చేవ్రాలు లేని చీటిఎక్కడను చెల్లదు.

క. మానఘనుఁ డాత్మధృతి చెడి
హీనుండగువాని నాశ్ర ♦ యించుటయెల్లం
మానెడుజలములోపల
నేనుఁగుమెయిదాఁచినట్లు ♦ లెఱుఁగుముసుమతీ. 91

టీ. సుమతీ ! మానఘనుఁడు=మిక్కిలి యభిమానముగలవాఁడు, ఆత్మన్=తనహృదయమునందు, ధృతి=ధైర్యము, చెడి=పోయి, హీనుఁడు=నీచుఁడు, అగువానిన్=అయినవానిని, ఆశ్రయించుట=సేవించుట, ఎల్లన్=అంతయు, మానెడుజలములలోపలన్=శేరునీళ్లలో, ఏనుఁగు, మెయి=తనశరీరమును, దాఁచినట్టులు=మరుగుపరుచుకొనునట్లు, ఎఱుఁగుము=తెలిసికొనుము.

తా. మానవంతుఁడు దుర్మార్గుని ఆశ్రయించుట చూడఁగా ఏనుఁగు, తనశరీరమును మానెడునీళ్లలో దాఁచుకొన్నట్లుగ నుండును.

క. రాపొమ్మని పిలువనియా
భూపాలునిఁగొల్వఁ భుక్తి ♦ ముక్తులుగలవే

దీపంబులేని యింటను
జేపున కిల్లాడినట్లు ♦ సిద్ధముసుమతీ. 92

టీ. సుమతీ ! రా=రమ్ము, పొమ్ము=వెళ్లుము, అని, పిలువనియా భూపాలునిన్=పిలువనట్టియారాజును, కొల్వన్=సేవించుటవలన, భుక్తి ముక్తులు=భుక్తియును ముక్తియును అనఁగా ఇహలోకసుఖము, పరలోక సుఖమును, కలవే=ఉన్నవా ! దీపంబు=దీపము, లేనియింటను= ఉండనిగృహమునందు, చేపునకిళ్ళు=చేపట్టులాటలు, ఆడినట్లు=ఆడిన విధముగ నుండును, సిద్ధము=నిజము.

తా. దీపములేని గృహమునందు శృంగారచేష్టలు చేసినచో నది సరసముగాను సుఖముగాను నుండదు. అవిధముగానే అవసరమయి నప్పుడు రమ్మనిపిలిచియు లేనప్పుడు వెళ్ళుమనిచెప్పియు నాదరించని ప్రభువుదగ్గర సేవించుటవలన సుఖము లేదు.

క. రూపించిపలికి బొంకకు
ప్రాపగుచుట్టంబు నెగ్గు ♦ పలుకకు మదిలోఁ
గోపించురాజుఁ గొల్వకు
పాపపుదేశంబుసొంకు ♦ పదిలముసుమతీ. 93

టీ. సుమతీ ! రూపించి=నిర్ధారణచేసి, పలికి=చెప్పి, బొంకకు= అసత్యమాడకుము, ప్రాపు=ఆధారము, అగుచుట్టంబున్=అయినబంధువును గూర్చి, ఎగ్గు=కీడును, పలుకకు=చెప్పకుము, మదిలోన్=మనస్సు నందు, కోపించురాజున్=కోపపడునట్టి ప్రభువును, కొల్వకు=సేవింప కుము, పాపపుదేశంబు=పాపముగలుగుస్థలమును, చొరకు=ప్రవేశిం పకుము, పదిలము=జాగ్రత్త.

తా. నిర్ధారణముగాముందుచెప్పి తరువాత అట్టుకాదని బొంకఁ కూడదు; సాహాయ్యభూతుఁడైన బంధువునుదూషింపకూడదు, కోపము గలరాజును సేవింపరాదు, సుఖమబ్బరాని స్థలమును ప్రొక్క కూడదు.

క. లావుగలవానికంటెను
భావింపఁగ నీతిపరుఁడు ♦ బలవంతుండౌ
గ్రావంబంతగజంబును
మావటివాఁడెక్కినట్లు ♦ మహిలో సుమతీ. 94

టీ. సుమతీ! మహిలోన్=భూమియందు, గ్రావంబంతగజంబును= కొండంతయేనుఁగును, మావటివాఁడు=మావటీండు, ఎక్కినట్లు=ఎక్కిన లాగున, లావు=శక్తి, కలవానికంటెను=కలిగినవానికంటె, భావింపఁగన్=ఊహింపఁగా, నీతిపరుఁడు=న్యాయమార్గమందాశక్తిగలవాఁడు, బలవంతుఁడు=బలముగలవాఁడు, ఔన్=అగును.

తా. గొప్పబలమును పొడుగునుగల ఏనుగునుఎక్కి చిన్నవాఁడైనను నేర్పుగలమావటివాఁడు తనకు స్వాధీనముచేసికొనినట్లు బలహీనుఁడైనను తెలివిగలవాఁడు ఎంతబలవంతునినైనను వశపఱుచుకొనఁ గలఁడు.

క. వఱదైనచేనుదున్నకు
కఱవైనను బంధుజనుల ♦ కడకేగకుమీ
పరులకుమర్మముచెప్పకు
పిఱికికిదళవాయితనము ♦ పెట్టకుసుమతీ. 95

టీ. సుమతీ ! వఱద=నీటివెల్లువగలది, ఐన చేను=అయినపొలమును, దున్నకు=దున్నకుము, కఱవు=కఱవు కాలము, ఐనను=అయినను, బంధుజనులకడకున్=చుట్టములయొద్దకు, ఏఁగకుమీ=వెళ్ళకుసుమా, పరులకున్=ఇతరులకు, మర్మము=రహస్యమును, చెప్పకు=చెప్పకుము, పిఱికికిన్=పిఱికివానికి, దళవాయితనము=సేనానాయకత్వమును, పెట్టకు= కలుగఁజేయకుము.

తా. వఱదలువచ్చి ప్రవహించుపొలమును దున్నుటతగదు, కఱవు

కాలమందైనను బంధువులయింటికి వెళ్ళవలదు; రహస్యపుసంగతుల నితరులతో చెప్పకూడదు, పిఱికిపందను సేనాధిపతిగాఁజేయరాదు.

క. వరిపంటలేని యూరును
దొరయుండనియూరు తోడు ♦ దొరకని తెరవున్
ధర నృపతిలేని గృహమును
నరయంగా రుద్రభూమి ♦ యనఁదగు సుమతీ. 96

టీ. సుమతీ ! ధరన్=భూమియందు, వరిపంట=వడ్లపంట, లేని యూరును=పండనిగ్రామమును, దొర=ప్రభువు, ఉండనియూరు=లేని గ్రామమును, తోడు=సహాయము, దొరకని తెరువున్=లభింపని ప్రయాణమును, నృపతి=రాజు, లేనిగృహమును=ఉండనియిల్లును, అరయంగాన్=ఆలోచింపఁగా, రుద్రభూమి=స్మశానప్రదేశము, అనన్=అని చెప్పగా, తగున్=ఒప్పును.

తా. వరిసస్యము పండనిగ్రామమును, రాజులేనియూరును, సహాయములేనిదూరప్రయాణమును, యజమానుఁడు లేనియిల్లును పాడుభూమితో సమానములు. అనఁగా అట్టిచోట్లజీవించుటకష్టమని తాత్పర్యము.

క. వలరసము సతికిఁబుట్టక
బలిమినిదమకించి విటుఁడు ♦ పైకొను టెల్లన్
మలయజము సానమీఁదను
జలముంపక తీసినట్టి ♦ చందము సుమతీ. 97

టీ. సుమతీ! వలరసము=మన్మథోద్రేకము, సతికిన్=స్త్రీకి, పుట్టక=కలుగకుండ, తమకించి=ఆతురపడి, బలిమిని=బలవంతముగా, విటుఁడు=విటకాఁడు, పైకొనుట=సంభోగించుట, ఎల్లన్=అంతయూ, సానమీఁదను=సానపైని, జలము=నీరు, ఉంపక=పోయక, మలయజమున్=గంధమును, తీసినట్టి, చందము=అరఁగఁదీసిన విధముగ నుండును.

తా. సానమీఁదఁగొంచెమైనను నీళ్ళుచల్లకుండ గంధముతీయుట యెట్లువృథాయాసమో కామవికారము పుట్టఁజేయకుండఁగ స్త్రీనిరమించుట విరసముగనుండును.

క. వినఁదగు నెవ్వరు సెప్పిన
వినినంతనె వేగపడక ♦ వివరింపఁదగున్
గనికల్ల నిజముఁ దెలిసిన
మనుజుఁడె పో నీతిపరుఁడు ♦ మహిలో సుమతీ. 98

టీ. సుమతీ! మహిలోన్=భూమియందు, ఎవ్వరు=ఎట్టివారు, చెప్పినన్=చెప్పినప్పటికిని, వినన్=వినుట, అగున్=ఒప్పును, వినినంతనే=వినినతక్షణమే, వేగపడక=తొందరపడక, వివరింపన్=విచారణచేయుట, తగున్=ఒప్పును, కని=విచారణచేసి, కల్ల=అసత్యమును, నిజమున్=సత్యమును, తెలిసినమనుజుఁడెపో=తెలుసుకొనిన మనుష్యుఁడే సుమా, నీతిపరుఁడు=న్యాయమునందాసక్తిగలవాఁడు.

తా. ఎంతమందేమి చెప్పినను చక్కఁగావినవలయును, వినఁగానే తొందరపడక విమర్శించి యిదినిజము, ఇదికల్లయని తెలుసుకొన్న వాఁడు నీతిపరుఁడనఁదగును.

క. వీడెము సేయని నోరును
జేడెలయధ రామృతంబుఁ ♦ జెందని నోరుం
బాడంగ రాని నోరును
బూడిదకిర వైనపాడు ♦ బొందర సుమతీ. 99

టీ. సుమతీ! వీడెము=తాంబూలము, చేయనినోరును=వేసుకొనని నోరును, చేడెల...అమృతంబున్, చేడెల=యౌవనవతులైన స్త్రీల యొక్క, అధర=అధరోష్ఠమునందలి, అమృతంబున్=అమృతమును, చెందనినోరున్=పొందనినోరును, పాడంగన్=పాడుటకు, రానినోరును=శక్తిలేనినోరును, బూడిదకున్=బూడిదకు, ఇరవు=స్థానము, ఐనపా

డుబొందర=అయినట్టిపాడుగొంది సుమా.

తా. తాంబూలము వేసు కొననని కోరును; యువతులయధరామృతము నుగ్రోలనికోరును, పాడనేరనికోరును బూడిదగుంటతో సమానము.

క. వెలయాలివలనఁ గూరిమి
కలుగదు మఱికలిగెనేని ♦ కడతేఱదుగా
పలువురు నడచెడు తెరువునఁ
బురిమొలవదు మొలిచెనేని ♦ పొదలదుసుమతీ. 100

టీ. సుమతీ ! వెలయాలివలనన్=భోగముదానివలన, కూరిమి=ప్రేమ, కలుగదు= కలుగనేకలుగదు, మఱి=ఒకవేళ, కలిగెనేని=కలిగినప్పటికిని, కడతేఱగా=తుదనెగ్గదుగదా, పలువురు= అనేకమంది, నడచెడితెరువునన్ =నడచునట్టిత్రోవలో, పురి=గడ్డి, మొలవదు=మొలవనే మొలవదు, మొలచిననేని=ఒకవేళ మొలచినప్పటికిని, పొదలదు=బ్రతుకదు.

తా. బాహాటముగా అనేకులు నడచునట్టిదారిలో గడ్డిమొలవనేమొలవదు. మొలచినను పెరిగివృద్ధిపొందదు. అదేవిధముగా వేశ్యాంగనకు ప్రేమన్నదేయుండదు. ఒకవేళ కారణాంతరముచే వేశ్యప్రేమించినను తుదనెగ్గింపదు.

క. వెలయాలు చేయుబాసలు
వెలయఁగ నగసాలిపొందు ♦ వెలమచెలిమియుం
గలలోనఁ గన్నకలిమియు
విరచితముగ నమ్మరాదు ♦ వినురాసుమతీ. 101

టీ. సుమతీ ! వెలయాలు=వేశ్య, చేయుబాసలు=చేయునట్టిప్రమాణములును, వెలయంగన్=ప్రసిద్ధముగా, అగసాలపొందు—కంసాలివాని స్నేహమును, వెలమచెలిమియున్=వెలమవాని స్నేహమును, కలలోనన్=స్వప్నమందు, కన్నకలిమియున్=అనుభవించిన సంపదను, విరచితముగన్=నిజముగ, నమ్మరాదు=నమ్మనలదు, వినురా=వినుము.

తా. భోగముది చేయు ప్రమాణములును, కంసాలివానితో స్నేహ

మును, వెలమకులమువానితో స్నేహమును, కలలోననుభవించిన సంపత్తును నమ్మఁదగినవి కావు.

క. శుభముల నొందనిచదువును
నభినయముగ రాగరసము ♦ నందనిపాటల్
గుభగుభలు లేని కూటమి
సభ మెచ్చనిమాటలెల్ల ♦ జప్పనసుమతీ. 102

టీ. సుమతీ! శుభములన్=మంగళములను, ఒందనిచదువును=పొందనివిద్యయు, అభినయముగన్=కాళ్ళుచేతులు లోనగువానితోడి యర్థసూచన గలుగునట్లుగా, రాగరసమున్=స్వరములసారస్యమును, అందనిపాటల్=పొందనిసంగీతమును, సభ=సభ, మెచ్చనిమాటలు=మెచ్చుకొననిపలుకులు, ఎల్లన్=అన్నియును, గుభగుభలు=గుభగుభమనుధ్వనులు, లేని కూటమి=లేనట్టిపదుగుండ్రకూడిక, చప్పన=రుచిలేనివి.

తా. లాభములేనివిద్యయును, అభినయమును మనోహరమైన రాగము, లేనిపాటలును, వినంపగిన నుత్సాహప్రసంగములు లేని మేళమును, సభలోనిజనులకురుచింపనిమాటలును రసహీనములు.

క. సరసము విరసముకొరకే
పరిపూర్ణసుఖంబులధిక ♦ బాధలకొఱకే
పెరుఁగుట విఱుగుటకొరకే
ధరతగ్గుట హెచ్చుకొరకె ♦ తథ్యముసుమతీ. 103

టీ. సుమతీ! సరసము=పరిహాసముగామాటాడుట, విరసముకొఱకే=రసభంగముకొఱకే, (అనగా పరిహాసము క్రమముగ శ్రుతిమించి విరోధముగా పరిణమించును.) పరిపూర్ణసుఖంబులు=సంపూర్ణముగా నున్న భాగ్యములు, అధికబాధలకొఱకే=ఎక్కువకష్టములకొఱకే=చెఱుపుకొఱకే, ధర=వెల, తగ్గుట=తక్కువయగుట, హెచ్చుకొఱకే=ఎక్కువగుటకొఱకే, తథ్యము=నిజము.

తా. మొట్టమొదట పరిహాసముగా ప్రసంగించినవే క్రమముగా విరోధములు పుట్టించును; పరిపూర్ణముగా సంపదయుండుట మిగుల

కష్టములకేయగును; ధర ఒకసమయమున తగ్గుట తరువాత గాయకమగు టకొరకేయగును.

క. మేలెంచని మాలిన్యుని
మాలనునగసాలవాని ♦ మంగలిహితుగా
నేలిన నరపతి రాజ్యము
నేలఁగలసిపోవుఁ గాని ♦ నెగడదుసుమతీ. 104

టీ. సుమతీ ! మేలు=ఉపకారమును, ఎంచనిమాలిన్యుని=తలపెట్టనటువంటిపాపాత్ముని, మాలను=మాలవానిని, అగసాలవాని=కంసాలవాని, మంగలిన్=మంగలివానిని, హితుగాన్=ప్రియునిగా, ఏలిన నరపతిరాజ్యమున్=పరిపాలనచేయు రాజుయొక్క ప్రభుత్వము, నేలన్=భూమియందు, కలిసిపోవున్=కలసిచెడిపోవును, కాని=అంతేకాని, నెగడదు=వృద్ధిపొందదు.

తా. ఇతరులు తనకు చేసినటువంటిఉపకారమును తలచనట్టిపాపాత్ముడు, మాల, కంసాలి, మంగలి, వీరినితనకుఇష్టమయినవారినిగాఁజేసి పరిపాలించిన రాజుయొక్క రాజ్యము నేలపాలగును కానివృద్ధి పొందదు.

క. స్త్రీలయెడవాదులాడకు
బాలురతోఁజెలిమిచేసి ♦ భాషింపకుమీ
మేలైన గుణమువిడువకు
మేలినపతినిందసేయ ♦ కెన్నఁడుసుమతీ. 105

టీ. సుమతీ ! స్త్రీలయెడన్=ఆడువాండ్రతో, వాదులాడకు=సంభాషణచేయకుము; బాలురతోన్=పిల్లలతో, చెలిమి=స్నేహమును, చేసి=చేసి, భాషింపకుమీ=మాటలాడకుసుమా, మేలు=మంచిది, ఐన గుణము=అయినమంచితనమును, విడువకుము=విడచిపెట్టకు, ఏలినపతిన్=పాలించినరాజును, ఎన్నడున్=ఏసమయమందైనను, నిందచేయకు=నిందించకుము.

తా. స్త్రీలతో సంభాషణచేయుట ముప్పునకుమూలము, బాలురకుచనువిచ్చిమాటలాడకూడదు; మంచిగుణములనువిడువకూడదు; పాలించినరాజును నిందచేయరాదు.

క. సిరితావచ్చినవచ్చును
సలలితముగ నారికేళ ♦ సలిలముభంగిన్
*సిరితాఁబోయినబోవును
కరిమ్రింగిన వెలఁగపండు ♦ కరణినిసుమతీ. 106

టీ. సుమతీ ! సిరి=భాగ్యము, తాన్=తాను, స్వయముగ, వచ్చినన్=కలిగినయెడల, నారికేళసలిలముభంగిన్=కొబ్బరికాయనీరువలె, సలలితముగన్=చక్కఁగా, వచ్చును=కలుగకమానదు; సిరి=సంపద, తాన్=తాను, పోయినన్=పోయినట్టులైన, కరి=ఏనుగు, మ్రింగినవెలఁగపండు కరణిని=మ్రింగినవెలఁగపండువలెనే, పోవును=చెడిపోవును.

తా. కొబ్బరికాయలో నెవడును బోయకుండనే నీరువచ్చినమాదిరిగా సంపదకూడ రానున్నప్పుడు కలుగకమానదు. ఏనుగు మ్రింగినవెలఁగపండులోని గుంజువలె, సంపద పోఁదలచినప్పుడు స్వయముగా మాయమగును.

క. మదినొకనివలచియుండఁగ
మదిచెడియొకక్రూరవిటుఁడు ♦ మానకతిరుగున్
బదిఁజిలుక పిల్లిపట్టినఁ
జదువునెయా పంజరమున ♦ జగతినిసుమతీ. 107

టీ. సుమతీ ! జగతిని=భూమియందు, మదిన్=మనసులో, ఒకనిన్=ఒకమనుష్యుని, వలచియుండగన్=ప్రేమించియుండఁగా, మది=బుద్ధి, చెడి=లేకపోయి, ఒక క్రూరవిటుఁడు=మఱియొక్కదుర్మార్గుండగు జారుఁడు, మానక=విడువక, తిరుగున్=దానిచుట్టుతిరుగును, పదన్=చక్కఁగా, చిలుక=రామచిలుకను పిల్లి, పట్టినన్=పట్టుకొన్నప్పుడు, ఆపంజరమునన్=ఆపంజరమందు, చదువునె=మాటాడునా ? ముద్దుమాటలుపలుకునా ? పలుకదు.

తా. పంజరములోని చిలుకను పిల్లిపట్టుకొనబోయినను చిలుక పంజరములో నుండినందున స్వాధీనముకాదు; చిలుక, ముద్దుపలుకులు కూడ పలుకదు. అదేవిధముగా స్త్రీ తానొక పురుషుని కామించియుండఁగా మఱియొకవిటుఁడెంత బలపరచినను లక్ష్యపెట్టక స్వాధీనము కాదు. మఱియు వానిని ప్రేమించిమాటలాడదు.

క. పుత్రోత్సాహము తండ్రికిఁ
బుత్రుఁడుజన్మించినపుడె ♦ పుట్టదుజనులా
పుత్రుని గనుఁగొని బొగడఁగఁ
బుత్రోత్సాహంబు నాఁడు ♦ పొందురసుమతీ. 108

టీ. సుమతీ ! తండ్రికిన్=తండ్రికి, పుత్రుఁడు=కుమారుఁడు, జన్మించినపుడు=పుట్టినతోడనే, పుత్రోత్సాహము=కుమారుఁడుకలిగెనను సంతోషము, పుట్టదు=ఉండదు, జనులు=ప్రజలు, ఆపుత్రునిన్=ఆకుమారుని, కనుగొని=చూచి, పొగడగన్=కొనియాడఁగా, నాఁడు=అప్పుడు, లోకులచే కొనియాడఁబడు నంతగుణవంతుఁడైనప్పుడు, పుత్రోత్సాహంబున్= పుత్రునియందు సంతోషమును, పొందుర= (తండ్రి) పొందును సుమా.

తా. పుత్రుఁడుపుట్టి గుణవంతుఁడైనప్పుడే తండ్రికిసంతోషముకలుగును కాని పుత్రసంతానమనఁగానే యుబ్బఁడు, అనగా గుణహీనుఁడు పుట్టినను పుట్టనట్లేయగును.

క. వేసరపుజాతికానీ
వీసముఁదా జేయనట్టి ♦ వ్యర్థుఁడుగానీ
దాసికొడుకైనఁగానీ
కాసులుగలవాఁడెరాజు ♦ గదరాసుమతీ. 109

టీ. సుమతీ ! వేసరపుజాతి=హీనజాతియందుఁ బుట్టినవాఁడు, కానీ=అయినను, తాన్ కాను, వీసమున్=కొంచెమైనను, చేయనట్టివ్యర్థుఁడు=పనికిమాలినఅప్రయోజకుఁడు, కానీ=అయినను, దాసికొడుకు=దాసికిఁ బుట్టినవాఁడు? ఐనంగానీ=అయినప్పటికి, కాసులు=బంగారము, కలవాఁడె=ఉన్నవాఁడు మాత్రమె, రాజు=ప్రభువు, కదరా=కాదా, అగును.

తా. ధనవంతుఁడు కులముచెడినవాఁడైనను చెడ్డగుణముకలవాఁడైనను దాసీపుత్రుఁడైనను లోకులు వానిని గౌరవించిరాజుగా కొనియాడుదురు,

సంపూర్ణము.